
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

ఆదివారం 19 జనవరి 2025



సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ట్రాక్టర్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి మనోహర్, ఎమ్మెల్యే నరేంద్ర, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

- వాడవాడలా అన్నదానాలు.. రక్తదానాలు
- సంక్షేమ పథకాల రూపకర్తని కొనియాడిన నేతలు
- రుద్రవరంలో కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు
- వినుకొండలో భారీ ర్యాలీ.. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి



వినుకొండలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

ఎన్టీఆర్‌కు.. ఘననివాళులు

ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్, జనవరి 18: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు.. మాజీ ముఖ్యమంత్రి.. స్వర్గీయ నందమూరి తారకరామారావుకు జిల్లావ్యాప్తంగా శనివారం ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తల నుంచి సామాన్య ప్రజల వరకు ఘనంగా నివాళులర్పించారు. వాడవాడలా ఎన్టీఆర్ విగ్రహాలను సుందరంగా అలంకరించిన అభిమానులు ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఇక ప్రధాన కూడళ్లలో ఎన్టీఆర్ చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పెద్దఎత్తున అన్నదానాలు చేశారు. కొన్ని దగ్గర్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయగా టీడీపీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. రక్తదానం చేసిన వారిని నేతలు ప్రత్యేకంగా అభినందించారు. పారిశుధ్య కార్మికులకు, పేదలకు నేతలు దుస్తులు పంపిణీ చేశారు. చిలకలూరిపేట 32వ వార్డు భావనారుషి నగర్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆవిష్కరించారు. మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో ఎమ్మెల్యేతోపాటు 50 మంది రక్తదానం చేశారు. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీతోపాటు బాలింతలకు ఆర్థికసాయం అందించారు. నరసరావుపేట నియోజకవర్గ కార్యాలయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. నకరికల్లులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు.

- వినుకొండలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని శివయ్య స్థూపం, ఆర్టీసీబస్టాండ్, విష్ణుకుండినగర్‌లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ జీవీతో కలిసి నివాళులు అర్పించారు. గంగినేని కళ్యాణ మండపం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. లెజండరీ బ్లడ్ డొనేషన్ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు ప్రజలకు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీ రామారావు బాటలో ఆయన ఆశయాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొనసాగిస్తున్నారన్నారు. జీవీ మాట్లాడుతూ పేదలు ఇళ్ళు అంటే గుడిసెలు అనుకునే రోజుల్లో శాశ్వత ఇళ్లు కట్టించిన మహానుబావుడు ఎన్టీఆర్ అని కొనియాడారు.
- అచ్చంపేట మండలంలోని రుద్రవరం గ్రామంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవాన్ని నలు దిశలా చాటిన వ్యక్తి ఎన్టీఆర్ అని తెలిపారు.



అచ్చంపేట మండలం రుద్రవరంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, కొమ్మాలపాటి శ్రీధర్

స్వచ్ఛత అందరి బాధ్యత

- పారిశుధ్య నిర్వహణపై క్రమశిక్షణ అవసరం
- స్వచ్ఛ ఆంధ్రా.. స్వచ్ఛ దివస్‌లో పవన్‌కల్యాణ్
- నంబూరులో చెత్త సంపద సృష్టి కేంద్రం పరిశీలన
- 35 మంది స్వచ్ఛ కార్మికులకు ఉపముఖ్యమంత్రి సత్కారం
- చెత్త రవాణా వాహనం ప్రారంభించి, స్వయంగా నడిపిన పవన్‌కల్యాణ్

చెత్త పునర్వినియోగంతో సంపద

పెదకాకాని, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛత విషయాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలి. చెత్తే కదా.. ఏం చేస్తాం అని కాకుండా.. దాని నుంచి సంపద సృష్టించాలి. శుభ్రత, స్వచ్ఛత ప్రజల జీవన విధానంలో ఓ భాగం కావాలి. పరిసరాల శుభ్రత.. స్వచ్ఛత పరిరక్షణకు అందరూ కృషి చేయాలి..' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం వద్ద శనివారం మొక్కను నాటి 'స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత గ్రామ స్థాయిలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అనంతరం చెత్త సంపద కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను పరిశీలించారు. వ్యర్థాల నిర్వహణ, వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్, శానిటరీ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరికరాల పనితీరు గురించి అధికారులను ప్రశ్నించారు. చెత్త సేకరణ, నిర్వహణ, సంపద సృష్టి తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తతో పాటు విష పూరిత వ్యర్థాలను వేరు చేసేందుకు ఇంటికి మూడు బుట్టలు ఇస్తున్నట్లు అధికారులు పవన్ కల్యాణ్‌కు చూపారు. చెత్త నిర్వహణలో ఉపయోగించే పరికరాల పనితీరుని తెలుసుకున్నారు. చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న గ్రామాల వివరాలు, సంపద సృష్టి కేంద్రాల సహకారంతో పండించిన పండ్లు, కూరగాయల ప్రదర్శనను తిలకించారు. అనంతరం చెత్త రవాణా వాహనాన్ని ప్రారంభించి, ట్రాక్టర్ నడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో అందరూ పాటించినట్లుగా పారిశుధ్య నిర్వహణ, స్వచ్ఛత విషయంలో క్రమశిక్షణ మళ్లీ రావాలన్నారు. చెత్తను పునర్వినియోగం చేసుకునేలా ఇంట్లోనే వేరు చేయాలన్నారు. చెత్త ద్వారా విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ, వర్మీ కంపోస్టు తయారీకి స్థానిక సంస్థలు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమం ప్రారంభమైందని, ప్రతి నెల మూడో శనివారం నిరంతరాయంగా ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు.



దివ్యాంగుడితో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్



పారిశుధ్య కార్మికురాలిని సత్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పక్కన మంత్రి మనోహర్, ఎమ్మెల్యే నరేంద్ర, కలెక్టర్ నాగలక్ష్మి, తదితరులు

పారిశుధ్య సిబ్బంది సేవలు అమూల్యం

పారిశుధ్య సిబ్బంది సేవలు అమూల్యమైనవని పవన్‌కల్యాణ్ తెలిపారు. వారిని గౌరవించుకోవడం ప్రజలందరి బాధ్యతన్నారు. ఇటీవల విజయవాడ వరదల సమయంలో ఎంతో కష్టపడి పని చేసి, ప్రజల మన్ననలు అందుకున్న 35 మంది పారిశుధ్య సిబ్బందిని సత్కరించారు. ప్రతి ఒక్కరిని పేరు పేరున పలకరిస్తూ, శాలువా కప్పి నూతన వస్త్రాలు, పండ్లు బహూకరించారు. కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కలెక్టర్ నాగలక్ష్మి, జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ల ట్రెక్కింగ్...

6



కొండపల్లి కోటపై ట్రెక్కింగ్ చేస్తున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- పండగకు 250పైనే ఏర్పాటు
- రద్దీ దృష్ట్యా శని, ఆదివారాల్లో 76 బస్సులకు ప్రణాళిక
- ఇప్పటికే రూ.70 లక్షల పైనే ఆదాయం

6



జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు

- కెడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అనుమతి

8



6

యడ్లపాడు-1 వీఆర్వో సుభాని సస్పెన్షన్?

ఫిబ్రవరి నెలాఖరు వరకు రెండు మెమూ రైళ్ల రద్దు

నేడు, రేపు పలు ప్రత్యేక రైళ్లు

త్రిసభ్య కమిటీలు.. సహకార సంఘాల పాలకవర్గాలుగా నియిమితులు కానున్నాయి. ఎన్నికలు జరిగే వరకు వారిదే అధికారం. ఆయా కమిటీలపై కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నెలాఖరు కల్లా కమిటీలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఒక్కొక్క సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జిగా ఒకరిని, సభ్యులుగా ఇద్దరి పేర్లను ఎంపిక చేయాలి. ఈ బాధ్యతలను పార్టీ అధిష్ఠానం నియోజవకర్గాల వారీగా ఎమ్మెల్యేలకు అప్పగించింది. సొసైటీల వారీగా త్రిసభ్య కమిటీల కోసం ఎమ్మెల్యేలు పేర్లను సేకరిస్తున్నారు. కమిటీల్లో పదవుల కోసం కూటమి నేతల నుంచి ఎమ్మెల్యేలపై ఒత్తిడి అధికంగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో సొసైటీల వారీగా పేర్లను ఖరారు చేయడం ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది.

- 168 సహకార సంఘాలకు నియామకం
- నెలాఖరుకు ఏర్పాటు కానున్న కమిటీలు
- సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జి, ఇద్దరు సభ్యులు
- ఎన్నికల వరకు త్రిసభ్య కమిటీలకే అధికారాలు
- పదవుల కోసం నేతల నుంచి ఎమ్మెల్యేలపై ఒత్తిడి
- నియోజకవర్గాల వారీగా రూపొందుతున్న జాబితాలు

కమిటీలపై కసరత్తు



జొన్నలగడ్డ సొసైటీ కార్యాలయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 168 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. ఆయా సొసైటీల బాధ్యతలను త్రిసభ్య కమిటీలకు అప్పగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సొసైటీలకు ఎన్నికలు నిర్వహించే వరకు త్రిసభ్య కమిటీలను కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొసైటీల బాధ్యతలను పర్సన్ ఇన్‌చార్జ్‌లకు అప్పగించింది. అయితే పర్సన్ ఇన్‌చార్జ్ పాలనను కొనసాగిస్తూ ఉత్తర్వులు విడుదలతో నేతల ఆశలపై నీళ్ల చల్లినట్లయింది. ప్రభుత్వ నిర్ణయంపై సొసైటీ పదవులు ఆశించిన నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం తన నిర్ణయంలో మార్పు చేసి త్రిసభ్య పాలనకు సిద్ధమైంది. దీంతో పదవులు ఆశిస్తున్న నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సొసైటీల వారీగా కమిటీల కోసం నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. కొన్ని సొసైటీలకు నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇటువంటి వాటికి ఆ పరిధిలోని మెజార్టీ నేతల అభిప్రాయంతో పేర్లను ఖరారు చేస్తున్నారు.

504 మందికి పదవులు

సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీల నియామకంతో కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు నామినేటెడ్ పదవుల పండుగ నెలకొంది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 504 మంది నేతలకు పదవులు లభించనున్నాయి. పార్టీ కోసం కష్టపడటంతో పాటు వైసీపీ హయాంలో తీవ్రంగా నష్టపోయిన వారికి ఆయా పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలని నేతలు కోరుతున్నారు.

అన్నీ చక్కదిద్దాకే ఎన్నికలు..

నిబంధనలకు విరుద్ధంగా సహకార సంఘాల్లో పార్టీ కార్యకర్తలను వైసీపీ నేతలు సభ్యులుగా చేర్చారు. సొసైటీల ఓటర్ల జాబితాల్లో పెద్దఎత్తున అవతవకలు ఉన్నట్లు కూటమి నేతలు

(మిగతా 8వ పేజీలో)

అయ్యో.. అంబటి

- రాంబాబుకి సీటు హుళక్కేనా?
- సత్తెనపల్లి ఇన్‌చార్జిగా డాక్టర్ గజ్జల
- గుంటూరు జిల్లా అధ్యక్ష బాధ్యతలకే పరిమితం
- పశ్చిమ సీటు ఆశించగా నిరాకరించిన జగన్
- సొంత నియోజకవర్గం రేపల్లే ఇక దిక్కా?



గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఉండదా అంటే ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు అవుననంటు న్నాయి. సత్తెనపల్లి ఇన్‌చార్జిగా ఉన్న ఆయనను ఇటీవల పక్కన పెట్టి గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో గుంటూరు పశ్చిమ సీటు ఆశించగా పార్టీ అధినేత జగన్ నిరాకరించారు. ఈ పరిస్థితుల్లో ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీపై అనుమానాలు నెలకొన్నాయి. 2019 ఎన్నికల్లో అంబటి సత్తెనపల్లి నుంచి అప్పటి స్పీకర్ డాక్టర్ కోడెలపై విజయం సాధించి అమాత్య పదవిని దక్కించుకు న్నారు. అయితే నియోజకవర్గంలో వైసీపీకి ప్రధానంగా కొమ్ముకాసే ఓ సామాజిక వర్గం ఆయన తీరును తొలి నుంచి వ్యతిరేకిస్తూనే వచ్చింది. ఒక దశలో ఆయనకు తిరిగి టికెట్ ఇవ్వకుండా అడ్డుకునేందుకు గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, నలంద విద్యా సంస్థల అధినేత వరప్రసాదరెడ్డి తీవ్రంగా ప్రయత్నిం చారు. అయితే తన వాగ్ధాటితో నిత్యం టీడీపీపై బురద జల్లడంలో రాంబాబుది అందె వేసిన చేయి కావడంతో జగన్ అంబటి అభ్యర్థిత్వానికే మొగ్గు చూపారు. 2024 ఎన్నికల్లో పరాజయం పాలైన అంబటిని పదోన్నతి పేరుతో గుంటూరు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తూ సత్తెనపల్లి నుంచి ఉద్వాసన చెప్పారు. అంతే గాకుండా రెండు, మూడు రోజుల క్రితం సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డికి అప్పగిస్తూ జగన్ అధికారికంగా ప్రకటించారు. దీంతో అంబటికి సత్తెనపల్లి ద్వారాలు మూసుకుపోయాయి. కాగా అంబటికి గుంటూరు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సమయం లోనే గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ మంత్రి విడదల రజినికి చిలకలూరిపేట బాధ్యతలు అప్పగించారు. దీంతో తనకు గుంటూరు పశ్చిమ బాధ్యతలు అప్పగిస్తారని అంబటి ఆశించారు. ఈ క్రమంలో తనకు పశ్చిమ బాధ్యతలు అప్పగించాలని జగన్‌ను అంబటి కోరినా దాట వేసినట్లు సమాచారం. టీడీపీ కంచుకోటగా ఉన్న పశ్చిమ నియోజకవర్గంలో కొత్త ప్రయోగం చేసే ఉద్దేశంలో జగన్ ఉన్నట్లు పార్టీ నేతలు చెప్తున్నారు. తరచూ వివాదాస్పదంగా వ్యాఖ్యలు చేసే అంబటికి పశ్చిమలో అంత అనుకూల వాతావరణం కూడా ఉండదనే భావన ఆ పార్టీ నేతల్లో ఉంది. పైగా ఇదే నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టాలనే ఆశలో మేయర్ కావటి మనోహర్‌నాయుడు ఉన్నారు. చిలకలూరిపేట పగ్గాలు రజినికి అప్పగించడంతో గత ఎన్నికల్లో పోటీ చేసిన మనోహర్‌కు ఆ నియోజకవర్గంతో సంబంధాలు తెగిపోయాయి. ఈ పరిస్థితుల్లో అంబటికి తిరిగి తన సొంత నియోజకవర్గమైన రేపల్లె నుంచి పోటీ చేసే అవకాశం కల్పిస్తారనే వాదన వినిపిస్తున్నది. లేదంటే ఆయన్ను ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉంచి, పార్టీ పరంగా ఉపయోగించుకునే ఆలోచన జగన్‌కు ఉందని ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

తెలుగు జాతి హృదయాల్లో చిరస్థాయిగా ఎన్టీఆర్

● విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య



ఎన్టీఆర్‌కు గ్రంథాలయ వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి హృదయాల్లో ఎన్టీఆర్ ఎప్పటికీ చిరస్థాయిగా ఉంటారని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఎన్టీఆర్ లైబ్రరీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 29వ వర్ధంతి ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలు, మహిళలకు సమాన అవకాశాలు, విద్య, ఆరోగ్యం వంటి రంగాలలో ఆయన ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని కొనియాడారు. తెలుగు సినీ పరిశ్రమలో గొప్ప నటుడిగా ప్రతి పాత్రకు జీవం పోసి, ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారన్నారు. ప్రజలతో కూడా ఆయనకున్న అనుబంధం ప్రత్యేకమని, అందరూ ప్రేమించే నాయకుడిగా ఎదిగారని వెల్లడించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ పోటీలకు ఏఎన్‌యూ మహిళా క్రికెట్ జట్టు

పెదకాకాని, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా క్రికెట్ జట్టు సౌత్ జోన్ క్రికెట్ పోటీలకు సన్నద్ధమవుతోంది. ఈ నెల 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మైసూర్‌లో జరిగే ఈ పోటీలకు జట్టును ఎంపిక చేసినట్లు వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్ శనివారం తెలిపారు. విశ్వవిద్యాలయం ఏర్పాటు దగ్గర నుంచి ఇప్పటి వరకు మహిళల క్రికెట్ జట్టును ఎంపిక చేయలేదనీ, మొట్టమొదటిసారిగా ఈ ఏడాది ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ జట్టు 20వ తేదీ వరకు వర్సిటీలో శిక్షణ పొంది అనంతరం మైసూర్ వెళ్లనుందని పేర్కొన్నారు. జట్టు మేనేజర్‌గా సాధన డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జె.ప్రేమ్ కుమార్, కోచ్‌గా ఫిరంగిపురంలోని సెయింట్ జేవీయర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ ఫిజికల్ డైరెక్టర్ కె.మోజేస్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. వర్సిటీ నుంచి మహిళల జట్లను ఎంపిక చేయటంపై వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలకు ధన్యవాదాలు తెలియజేశారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి

అమృతలూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పొలం పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న రైతు ప్రమాదవశాత్తూ మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని పాంచాళవరం గ్రామానికి చెందిన ఘంటా మదన్‌మోహనరావు (75) వ్యవసాయం చేస్తున్నాడు. గత కొంత కాలంగా గూడవల్లి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో పాంచాళవరం తన ట్రాక్టర్‌పై వచ్చి తమ పొలంలోని మినుము పైరును తడుపుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ ఆయన నడుపుతున్న ట్రాక్టర్ పంట కాల్వలోకి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ కింద ఆయన పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఎన్నారైలు ముందుకు రావాలి

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



స్కూల్‌ను ప్రారంభిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, ఆలపాటి, దాత సుధాకర్, సర్పంచి పవన్‌కుమార్

తెనాలి రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మాతృభూమి రుణం తీర్చుకునేలా ఎన్నారైలు ముందుకు రావాలని, సొంత గ్రామంలో విద్యాలయం నిర్మాణానికి ఎన్నారై ధూళిపాళ్ల సుధాకర్, మాధురి దంపతులు చేసిన కృషి అందరికీ స్ఫూర్తిదాయకమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని నంది వెలుగు గ్రామంలో ప్రభుత్వ, దాతల సహకారంతో జడ్పీహెచ్ఎస్ స్కూల్ నూతన భవనం, ప్లే గ్రౌండ్, ప్రహరీ, క్లాస్ రూమ్‌ల తదితర మౌలిక వసతుల ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, దాతలు ఎన్నారై ధూళిపాళ్ల సుధాకర్, మాధురి కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి స్కూల్‌ను ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామంలో పిల్లల చదువుకు అవసరమైన మౌలిక వసతులతో స్కూల్ భవనాన్ని తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చిన ఎన్నారై ధూళిపాళ్ల కుటుంబ సభ్యులు, డబుల్ హార్స్ ఎండీ మునగాల శ్యామ్ ప్రసాద్, ఇతర దాతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎన్నారైగా స్థిరపడినా, ధూళిపాళ్ల సుధాకర్ తాను చదివిన స్కూల్ దుస్థితిలో ఉండటాన్ని గుర్తించి దాని అభివృద్ధికి రూ. లక్షల ఖర్చు చేసి తీర్చిదిద్దడం గొప్పవిషయమన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎన్నారైగా సుధాకర్ మేము సైతం టీం ద్వారా గ్రామాభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. దాత సుధాకర్ మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన గ్రామానికి ఎంతో కొంత సేవ చేయాలని తన కుటుంబ సభ్యులకు సైతం ఎప్పటికప్పుడు చెబుతూ, దానిని ఆచరణలోకి తీసుకువచ్చామన్నారు. గ్రామ సర్పంచి ధూళిపాళ్ల పవన్‌కుమార్, దాతల సహకారంతో మేముసైతం టీం పర్యవేక్షణలో స్కూల్ భవనాన్ని ఇతర మౌలిక వసతుల కల్పనకు ముందుకు వచ్చామన్నారు. తొలుత అతిథులకు ఎన్‌సీసీ క్యాడెట్లు స్వాగతం పలికారు. వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాలల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, బి.సురేంద్ర, విజయలక్ష్మి, ఎంతఃవోలు లక్ష్మీనారాయణ, జయంతి బాబు, నన్నపనేని లింగారావు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి నెలాఖరు వరకు రెండు మెమూ రైళ్ల రద్దు

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆపరేషనల్ సమస్యల దృష్ట్యా ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి నెలాఖరు(28వ తేదీ) వరకు రెండు మెమూ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 67769 విజయవాడ - గుంటూరు, నంబరు. 67770 గుంటూరు - విజయవాడ రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని సీపీఆర్‌వో విజ్ఞప్తి చేశారు.

నేడు, రేపు పలు ప్రత్యేక రైళ్లు

సంక్రాంతి పండగ సెలవులు ఆదివారంతో ముగియనుండటంతో రైళ్లలో రద్దీ తీవ్రత పెరిగింది. దాంతో ఆది, సోమవారంలలో పలు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదుగా నడిపేందుకు రైల్వే శాఖ నిర్ణయించినట్లు సీపీఆర్‌వో తెలిపారు. నంబరు 08510 చర్లపల్లి - విశాఖపట్నం రైలు ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదుగా రాత్రి 10 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు 08551 విశాఖపట్నం - చర్లపల్లి రైలు ఈ నెల 19న సాయంత్రం 6.20కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30కి విశాఖపట్నం చేరుకొంటుంది. నంబరు 08552 చర్లపల్లి - విశాఖపట్నం రైలు ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు విశాఖపట్నం చేరుకొంటుంది. నంబరు 08550 చర్లపల్లి - భువనేశ్వర్ రైలు ఈ నెల 19వ తేదీన ఉదయం 9 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి దాటాక 20వ తేదీ వేకువజామునకు ముందు 2.15కి భువనేశ్వర్ చేరుకొంటుంది.

23, 25 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు

వెల్లూరు(స్వర్ణ దేవాలయం), తిరువణ్ణామలై(అరుణాచలం), శ్రీరంగం, మధురై తదితర ప్రాంతాలను సందర్శించే యాత్రికుల కోసం ఈ నెల 23, 25 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదుగా నడపనున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. ఈ నెల 23న నంబరు 07175 సికింద్రాబాద్ - కొల్లం, 25న నంబరు 07176 కొల్లం - సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదుగా నడుపుతామన్నారు.

కొనసాగుతున్న ట్రెక్కింగ్ క్యాంపు



ట్రెక్కింగ్‌లో పాల్గొన్న క్యాడెట్లు

గుంటూరు (విద్య), నరసరావుపేట కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రెక్ 3 కార్యక్రమంలో భాగంగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ల ట్రెక్కింగ్ క్యాంపు కొనసాగుతోంది. శనివారం కొండవీడు చెక్‌పోస్టు నుంచి చారిత్రాత్మక కొండవీడు కోట వరకు 7 కి.మీ. ట్రెక్‌లో క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ ట్రెక్ కేవలం క్యాడెట్ల స్థైర్యాన్ని, క్రమశిక్షణను చూపించడమే కాకుండా, ఈ ప్రాంత సాంస్కృతిక వారసత్వాన్ని వెలుగులోకి తెచ్చింది. ట్రెక్ ముగిసిన తర్వాత క్యాడెట్లు రెడ్డి రాజుల వారసత్వ మ్యూజియాన్ని సందర్శించారు. కొండవీడు కోట చరిత్ర, ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. రెడ్డివంశ పాలన, కోట ఆర్కిటెక్చర్ పరిశీలించే అవకాశం లభించినట్లు విద్యార్థినులు పేర్కొన్నారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 18 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ ట్రెక్కింగ్ క్యాంపులో పాల్గొన్నారని కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు శనివారం తెలిపారు. గుంటూరు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న క్యాంపులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 510 మంది విద్యార్థినులు పాల్గొన్నారని తెలిపారు.

యడ్లపాడు-1 వీఆర్వో సుభాని సస్పెన్షన్?

యడ్లపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు-1 వీఆర్వో షేక్ సుభాని సస్పెండ్ అయ్యారు. సుభానిపై పలువురు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ విచారణ జరిపారు. ఆరోపణలు రుజువు కావడంతో సస్పెండ్ చేసినట్లు తెలిసింది. భూములకు సంబంధించి రికార్డులు తారుమారు చేయడం, లంచం డిమాండ్ చేయడం, అసైన్డ్ భూములకు పట్టాలు ఇప్పిస్తానంటూ పెద్ద మొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడడం వంటి ఆరోపణలతో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు అందాయి. దీంతో కలెక్టర్ అరుణ్‌బాబు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో తక్కెళ్ళపాడు రెవెన్యూ గ్రామంలో వీఆర్వోగా పనిచేసిన సమయంలోనూ పలు అక్రమాలకు పాల్పడగా అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. కొద్ది నెలల సస్పెన్షన్ తరువాత నూజెండ్ల మండలానికి కేటాయించారు. అయితే అప్పటి తహసీల్దార్ అతడిని చేర్చుకునేందుకు ఇష్టపడలేదు. దీంతో వీఆర్వో బంధువు వైసీపీ నాయకుని సిఫార్సుతో వంకాయలపాడు వీఆర్వోగా డిప్యూటేషన్‌పై వచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక సుభానిని వేరొక మండలానికి బదిలీ చేయగా అక్కడ చేర్చుకోకపోవడంతో తిరిగి యడ్లపాడు-1 వీఆర్వోగా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. అయితే వంకాయలపాడు వీఆర్వోగా పనిచేసిన సమయంలో పలువురి వద్ద నుంచి వసూళ్లకు పాల్పడి పనులు చేయకపోవడంతో వారంతా ఫిర్యాదులు చేయడం, విచారణలో నిజమని తేలడంతో సస్పెండ్ చేసినట్లు సమాచారం.

విశాఖకు రూ.11 వేల కోట్ల ప్యాకేజీ శుభపరిణామం

● మంత్రి అనగాని సత్యప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం రూ.11 వేల కోట్లకు పైగా ప్యాకేజీ ప్రకటించటం శుభపరిణామం అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నష్టాల్లో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను గట్టెక్కించేందుకు ఆర్థిక సాయం చేసిన ప్రధాన మంత్రి మోదీకి మంత్రి అనగాని కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ 1గా నిలిపేందుకు సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి మోడీ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అన్నీ అమలు చేస్తామని తెలిపారు. త్వరలో తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మహిళలకు నెలకు రూ.1500 త్వరలో అందించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్టు డయాఫ్రమ్ వాల్ నిర్మాణం తిరిగి ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలో నదుల అనుసంధాన ప్రాజెక్టుకి కూడా కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తుందని తెలిపారు. అమరావతి రాజధాని దేశానికే ఒక ఆదర్శం కాబోతుందన్నారు. సమావేశంలో కృష్ణా పశ్చిమ డెల్టా కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, మేకా వెంకటశివరామకృష్ణ, దండుప్రోలు వెంకటేశ్వరరావు, కొమ్మూరి వెంకటేష్, రేపల్లె సురేష్, పాపారావు, దేవగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

26న తెలుగు నాటకం, స్త్రీవాదంపై సదస్సు



మాట్లాడుతున్న వేదిక అధ్యక్షుడు సురేష్‌బాబు, సభ్యులు

యడ్లపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ, తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం (వేదిక) సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు నాటకం, స్త్రీవాదం అనే అంశాలపై సదస్సును ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. శనివారం యడ్లపాడులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు గ్రామీణ ప్రాంతంలో నిర్వహించడం ఇదే తొలిశారనీ, సాధారణంగా మహానగరాలు, పట్టణాలలో మాత్రమే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యడ్లపాడులో రచ్చబండ సెంటర్‌లోని ముత్తవరపు సురేష్‌బాబు నివాస ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సదస్సు జరుగుతుందని, తెలుగు నాటకం, సాహిత్యం, స్త్రీవాదం రంగాల్లో అనుభవజ్ఞులైన ప్రముఖులు పాల్గొంటారన్నారు. తెలుగు నాటకం, స్త్రీవాదంపై మహిళల్లో చైతన్యం కల్పించే ఉద్దేశంతో నిర్వహించే ఈ సదస్సుకు జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే మహిళా ఉపాధ్యాయులు, పది, ఇంటర్ చదివే విద్యార్థినులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సుమారు 300 మంది హాజరవుతారన్నారు. సమావేశంలో వేదిక సంయుక్త కార్యదర్శి పోహూరి నాగేశ్వరరావు, సభ్యులు ముత్తవరపు రామారావు పాల్గొన్నారు.

ముడుపులు ఇవ్వలేదని.. ప్రయోజనాలు ఆపారు

● కలెక్టర్‌కు విశ్రాంత ఉద్యోగిని ఫిర్యాదు

● చావే శరణ్యమని వేడుకోలు



మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగి పద్మావతి

గుంటూరు సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో అంతులేని నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ముడుపుల మత్తులో ఉన్న మినిస్టీరియల్ సిబ్బంది శాఖలో పని చేసిన వారిని కూడా పీడిస్తున్నారు. అడిగినంత ఇస్తే సరే, లేకుంటే అంతే అన్న విధానంలో అల్లాడిస్తున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు పనిచేసిన మహిళా ఉదోగిని ఆర్థిక బిల్లుల చెల్లింపు వ్యవహారంలో జరిగిన జాప్యం వైద్య, ఆరోగ్య శాఖ అవినీతికి నిదర్శనంగా నిలిచింది. పి.పద్మావతి వట్టిచెరుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ విజిటర్‌గా పనిచేస్తూ 2024 ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ పొందారు. ఆమె ఉద్యోగ విరమణకు ముందే ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన ఫైల్‌ను సిద్ధం చేయాల్సి ఉంది. సదరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డ్రాయింగ్ అధికారి, సీనియర్ అసిస్టెంట్ ఆ విషయాన్ని పట్టించుకోలేదు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత అయినా అన్ని బిల్లులు ట్రెజరీలో సమర్పిస్తారని పద్మావతి భావించారు. బాధ్యులైన అధికారుల్లో ఎటువంటి చలనం లేకపోవడంతో బాధితురాలు చాలా పర్యాయాలు ఆస్పత్రికి వచ్చి ప్రాధేయపడ్డారు. విషయాన్ని బాధితురాలు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. గత తొమ్మిది నెలలుగా ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నా బిల్లులను సిద్ధం చేయకపోవడంతో బాధితురాలు శనివారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిశారు. వట్టిచెరుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డీడీవో గుమ్మడి వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ కార్తీక్‌పై ఫిర్యాదు చేశారు. తనకు రావాల్సిన ఉద్యోగ విరమణ ప్రయోజనాల చెల్లింపు వ్యవహారంలో ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ.మూడు వేలు ఇంటి అద్దె కూడా చెల్లించలేని దుస్థితిలో ఉన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సత్వరమే న్యాయం జరగకపోతే తనకు చావే శరణ్యం అని బాధితురాలు జిల్లా కలెక్టర్ ముందు కన్నీటి పర్యంతం అయ్యారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన అనంతరం పద్మావతి విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన తరువాత కూడా తనను ఎంతగానో వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. అడిగినంత ముడుపులు ఇవ్వలేను అన్నందుకు ఇలా వేధించారని అన్నారు.

విస్తరణ పనులు ప్రారంభం



గుంటూరు కార్పొరేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో పెరిగిన ట్రాఫిక్ నియంత్రణకు నగరంలోని శంకర్ విలాస్ ఆర్.ఓ.బి నిర్మించుటకు ఇప్పటికే అనుమతులు మంజూరయ్యాయని, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా నగర పాలక సంస్థ తరుపున చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులు శనివారం నుంచి ప్రారంభించామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలియజేశారు. శంకర్ విలాస్ ఆర్ఓబీ నిర్మాణ పనుల నిమిత్తం చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మొత్తం 134 ఆస్తులలో బ్రాడీపేట అరండల్ పేటలకు సంబంధించిన 99 భవన యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వారి ఆస్తి అర్హతను బట్టి భవన యజమానులకు నష్టపరిహారం ఇస్తామన్నారు.

ప్రియురాలు తిరస్కరించిందని ప్రియుడు ఆత్మహత్య

బాపట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రియురాలు తిరస్కరించిందని ప్రియుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై చంద్రావతి తెలిపిన వివరాల మేరకు.. దుగ్గిరాల మండలం శృంగారపురం గ్రామానికి చెందిన శృంగారపాటి మురళీకృష్ణ (22) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. అదేమండలం చిన్నపాలెం గ్రామానికి చెందిన ఓ వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. శుక్రవారం ఉదయం మంగళగిరి ఎయిమ్స్‌లో పని ఉందని చెప్పి వచ్చిన మురళీకృష్ణ స్కూటిపై ఆమెను తీసుకొని బాపట్ల పట్టణంలోని భావన లాడ్జిలో భార్యభర్తలమని చెప్పి రూమ్ తీసుకున్నారు. సూర్యలంక సముద్రతీరానికి వెళ్లి వచ్చారు. అక్రమ సంబంధం వలన మీ కుటుంబ సభ్యులు తిడుతున్నారనీ, ఇకపై రానని ఆమె చెప్పటంతో మనస్తాపానికి గురైన మురళీకృష్ణ బయటకెళ్లి పురుగుమందు తెచ్చుకొని తాగాడు. ఆమె లాడ్జి ఓనర్‌కు చెప్పటంతో అంబులెన్స్ పిలిపించి ఆస్పత్రికి తరలించారు. అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మురళీకృష్ణ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142,151,162
చికెన్ విత్ స్కిన్	274.00
చికెన్ స్కిన్ లెస్	284.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

జలవనరుల శాఖ ఎస్ఈగా కేవీ రమణారెడ్డి

నరసరావుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ లింగంగుంట్ల ఓఅండ్ఎం సర్కిల్ ఎస్ఈగా కేవీ రమణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఎస్ఈగా వున్న కృష్ణమోహన్ ఈఈగా కొనసాగనున్నారు. ఎస్సీ రమణారెడ్డి త్వరలోనే విధుల్లో చేరనున్నట్టు కార్యాలయ వర్గాలు తెలిపాయి.



సబ్ జైలు పరిసరాలను పరిశీలిస్తున్న జడ్జీలు

సబ్ జైలులో జడ్జీల తనిఖీ

సత్తెనపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సబ్ జైలును శనివారం సాయంత్రం న్యాయాధికారులు కౌషిత్ హుస్సేన్, మహమ్మద్ గౌస్‌లు తనిఖీ చేశారు. జైలులోని పరిసరాలను పరిశీలించారు. ఆహార పదార్థాలను, నిత్యవసర వస్తువులను, బియ్యాన్ని పరిశీలించారు. ముద్దాయిలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. న్యాయ పరంగా వారికి ఉన్న హక్కుల గురించి వివరించారు. ఉచితంగా న్యాయ సహాయాన్ని అందిస్తామని, అవసరమైనవారు వినియోగించుకోవాలని కోరారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ గిరిరాజు, పట్టణ ఎస్ఐ పవన్ కుమార్, సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పిడుగురాళ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌టీయూసీ గురజాల నియోజకవర్గ క్యాలెండర్‌ను శనివారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆవిష్కరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ పట్టణ అధ్యక్షుడు యరగాని వెంకట్, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, పాండురంగ శ్రీను, సయ్యద్ అమీర్‌అలి, జడ్పీటీసీ సభ్యుడు వెంకట కోటయ్య, పిల్లి చెన్నారావు, నలబోతు గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

పిడుగురాళ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను మునిసిపల్ కమిషనర్ పీ.శ్రీధర్ శనివారం పరిశీలించారు. సిబ్బంది సమయపాలన, భోజనంలో నాణ్యత గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా వుండేలా చూసుకోవాలన్నారు. ఆయనతోపాటు ఏఈ రాఘవేంద్రరావు,డీఈ శ్రీనివాసరావు ఉన్నారు.

గడ్డి వాములకు నిప్పు..

మాచవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మాచవరంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వరి గడ్డి వాములకు నిప్పంటించి దహనం చేశారు. బాధితురాలు సారంగపల్లి వెంకాయమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. తాను కొనుగోలు చేసి ఇంటికి సమీపంలో నిల్వ చేసుకున్న గడ్డివాములను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని, సుమారు రూ 11వేలు నష్టం జరిగినట్టు వెంకాయమ్మ తెలిపింది.

వేలం వాయిదా

క్రోసూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట మండలం ఓర్వకల్లు గంగమ్మ తల్లి తిరునాళ్ళ హక్కుల కోసం శనివారం క్రోసూరులో నిర్వహించాల్సిన వేలం అధికారులు వాయిదా వేశారు. దేవాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి కోటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ లీలావతితో పాటు సిబ్బంది వేలం నిర్వాహణకు పూనుకున్నప్పటికీ ఎవ్వరూ పాల్గొనక పోవటంతో వాయిదా వేశారు. రంగుల రాట్నం నిర్వాహణ కోసం కే ఆనంద కుమారి రూ.98 వేలకు హక్కులను దక్కించుకోగా మిగతా వాటికి వేలాన్ని వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.

చామర్రులో సైకిళ్లు పంపిణీ

అచ్చంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చామర్రు గ్రామంలో వెంకటరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో పది మంది బాల బాలికలకు శనివారం సైకిళ్ళు అందజేశారు. చామర్రు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస మూర్తి వీటిని అందించారు.

పింఛన్‌లపై విచారణ

సత్తెనపల్లి రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిగామ, గుడిపూడి, భీమవరం, లక్కరాజుగార్లపాడు, కంటెపూడి, కొమెరపూడి, పెద మక్కెనతో పాటు పలు గ్రామాల్లో శనివారం అధికారులు పింఛన్‌ల వెరిఫికేషన్ చేపట్టారు. పణిదం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్ ఆధ్వర్యంలో బృందం సభ్యులు గ్రామాల్లోని పింఛన్‌ల దారుల ఇళ్లకు వెళ్ళి పరిశీలన చేపట్టారు.

కేపీగూడెంలో ఎస్పీ పర్యటన

వెల్దుర్తి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేపీగూడెంలో శనివారం ఎస్పీ శ్రీనివాసరావు పర్యటించారు. గ్రామంలో కొనసాగుతున్న పోలీస్ పికెట్‌ను పరిశీలించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా పోలీసు అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, వెల్దుర్తి ఎస్ఐ సమందర్‌వలి తదితరులు ఉన్నారు.

చోరీ గృహాలను పరిశీలించిన ఎస్పీ

గురజాలటౌన్,(ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణంలో, మండలంలోని పులిపాడు గ్రామంలో ఈనెల 14న అర్ధరాత్రి సుమారు 10 గృహాల్లో చోరీలు జరుగగా, ఆయా గృహాలను శనివారం రాత్రి ఎస్పీ కంచి శ్రీనివాసరావు పరిశీలించారు. పట్టణంలోని వికలాంగుల కాలనీ, కట్టెల అడితి సెంటర్, పులిపాడులోని గృహాలకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడారు. చోరీ జరిగిన తీరుని గురించి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట గురజాల డీఎస్పీ జగదీష్, సీఐ భాస్కర్, ఎస్ఐ వినోద్‌కుమార్ ఉన్నారు.

తెలుగువారి గుండెచప్పుడు ఎన్టీఆర్

- మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి
- వాడవాడలా ఎన్టీఆర్ 29వ వర్ధంతి..
- విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించిన టీడీపీ ప్రజా ప్రతినిధులు, నేతలు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

మాచర్లటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల గుండెచప్పుడు ఎన్టీఆర్ అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని మాచర్ల పట్టణంలో నిర్వహించగా, ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే జూలకంటి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లోనే ఎన్టీఆర్ శకం ఓ వెలుగురేఖ అని, పార్టీ స్థాపించిన అనతి కాలంలోనే అధికారం చేపట్టి చరిత్ర సృష్టించిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. బడుగు, బలహీనవర్గాల్లో రాజకీయ చైతన్యాన్ని నింపి వారికి రాజకీయ రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. అలాగే స్త్రీలకు ఆస్థిలో సమానవాటాతో పాటు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, కొమెర దుర్గారావు, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కజ్జం సైదయ్య, కొమెర అనంతరాములు, మద్దిగపు వెంకట్రామిరెడ్డి, వజ్రం నాయక్, వేణు, శివ, మోసిన్, కంభంపాటి అనిల్, పేరువాల పుల్లారావు, ఉప్పుతోళ్ల పెద ఏడుకొండలు, బండ్ల బ్రహ్మం, షేక్ జాని, పంగులూరి అంజయ్య, మున్నా రాంబాబు, మాచర్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభం..

పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణానికి బ్లడ్ బ్యాంకు మంజూరైందని, త్వరలోనే ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డితో పాటు 50 మంది రక్తదానం చేశారు.

రెంటచింతల,(ఆంధ్రజ్యోతి): స్థానికబస్టాండ్ సెంటర్ వద్ద నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. తొలుత ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు రాజారెడ్డి, సుమంత్‌రెడ్డి, బోడపాటి రామకృష్ణ, రాయపరెడ్డి, శౌరైడ్డి, తదితరులు పాల్గొన్నారు. పాలువాయి గ్రామంలోసుధాకర రెడ్డి నేతృత్వంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దుర్గి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గిలోని బస్టాండ్ సెంటర్ వద్ద టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వెల్దుర్తి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోదలవీడులో ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పులిహార పంపిణీ చేశారు. కార్యక్రమంలో మందలపు రామకృష్ణ, సర్పంచ్ ధర్మవరపు శ్రీనివాసరావు, గుండు కృష్ణమూర్తి, ముప్పాళ్ల వెంకటేశ్వర్లు, సుధీర్, హనుమంతు, సాదనాల ప్రసాద్, మల్లికార్జునరావు, బ్రహ్మం, పుట్టా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ నేత ఎన్టీఆర్..

- ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల,(ఆంధ్రజ్యోతి): దేశం గర్వించదగ్గ గొప్ప నేత ఎన్టీఆర్ అని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ పిడుగురాళ్ల కార్యాల యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే యరపతినేని పూలమాలవేసి నివాళులర్పించారు. గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల మండలాల్లో



పిడుగురాళ్లలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, నాయకులు

జరిగిన వర్ధంతి కార్య క్రమాల్లో ఎమ్మెల్యే యరపతినేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో చరిత్ర సృష్టించిన గొప్ప నేత ఎన్టీ రామారావు అని, కిలో రూ.2 బియ్యం, జనతా వస్త్రాలు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీ రామారావుదే అన్నారు. స్థానిక వున్నం కాంప్లెక్స్ వద్ద పోట్ల బ్రహ్మం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. జూలకల్లు, గుత్తికొండ, జానపాడు తదితర గ్రామాల్లోనూ వర్ధంతి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, జడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకట కోటయ్య, పాండురంగ శ్రీను, వడ్లమూడి సర్వేశ్వరరావు, పిల్లి చెన్నారావు, గండికోటవెంకటేశ్వర్లు, బడిగుంచల వెంకటేశ్వర్లు, వడ్లవల్లి సాంబశివరావు, సయ్యద్ అమీర్‌అలి, పణితి రవి, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, ఎల్‌వీఆర్, జొన్నలగడ్డ శ్రీను, వున్నంసురేష్, ముప్పాళ్ల సాంబయ్య పాల్గొన్నారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): కారంపూడి ఇందిరాగాంధీ బొమ్మ సెంటరు వద్దగల ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, చప్పిడి రాము, మునుగోటి సత్యం, జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్, బొర్లెడి శ్రీనివాసరావు, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, ఎస్‌పీఆర్ కృష్ణ, కర్నా సైదారావు, బాణావత్ బాలునాయక్, నాగులనాయక్, తోట నరసింహారావు, కాటంరెడ్డి నాగలక్ష్మిరెడ్డి, తండా జానీబాషా పాల్గొన్నారు.

దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచా యతీ పరిధిలోని నారాయణపురం రైల్వేస్టేషన్ రోడ్డు వద్దగల ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళులర్పించారు. తొలుత కారంపూడి రోడ్డులో బుర్రి సురేష్, వెలిశెట్టి అప్పారావుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలోనూ, తారకరామ వడ్డెర సొసైటీ ఆధ్వర్యంలోనూ ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకట కోటయ్య, నేతలు తంగెళ్ల శ్రీనివాసరావు, నర్రా పుల్లయ్య, భద్రి, పగడాల భాస్కరరావు, వేములవినోద్‌రెడ్డి, అక్కినపల్లి బాలయ్య, నెల్లూరి రామకోటయ్య, పురంశెట్టి పరంజ్యోతి, కోట శాయన్న, కూరాకుల నాగేశ్వరరావు, వేముల కృష్ణ, చికెన్ జానీబాష, షేక్ అహ్మదా, కోరె రామారావు, గుదె సైదయ్య, అప్పారావు, అంజి, బొమ్మిరెడ్డి సత్యం, నారాయణ, షేక్ జానయ్య, చింతపల్లి హసన్ అహ్మద్, తూమాటి నరసింహారావు, సాదినేని కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాచవరం, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాచవరం, వేమవరం, చెన్నాయపాలెం, కొత్తపాలెం, మోర్జంపాడు, పిల్లుట్ల, మల్లవోలు, పిన్నెల్లి, కొత్తగణేషునిపాడు తదితర గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నేతలు నివాళులర్పించారు.

గురజాలటౌన్, (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల అభిమాన నేత ఎన్టీఆర్ అని గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతిలో జడ్పీటీసీ జంగా కోటయ్యతో కలిసి ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన సంజీవని ఉచిత ఆరోగ్యరథం నాలుగు వాహనాలను ఎమ్మెల్యే యరపతినేని ప్రారంభించారు.

సంక్షేమ పాలనకు నాంది పలికిన ఎన్టీఆర్

- ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు,(ఆంధ్రజ్యోతి): సంక్షేమం అమలుకు, అభివృద్ధికి నిర్వచనంగా, సంస్కరణలకు ఆద్యుడిగా మహానేత ఎన్టీ తారక రామారావు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. నకరికల్లులో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ.. ప్రభుత్వం అంటే పాలకులు కాదు.. సేవకులని ఎన్టీఆర్ చాటి చెప్పారన్నారు. కార్యక్రమం లో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేటు శౌరయ్య, డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ, షేక్ అలీ బాషా, సాగి శ్రీనివాసరావు, పూజల వెంకట కోటయ్య, రావిళ్ళ గోపీకృష్ణ, తిరుమలశెట్టి వెంకటరావు, నాదెండ్ల సత్యనారాయణ పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే కన్నా పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు.



నకరికల్లులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో, వివిధ ప్రాంతాల్లో టీడీపీ నేతలు ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. టీడీపీ ప్రజా వేదికలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటాలకు, విగ్రహాలకు నేతలు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామ స్వామి, చౌట శ్రీనివాసరావు, నాయకులు నూర్ బాషా జానీ బాబు, మన్నవ శారదాదేవి, వక్కంటి అజయ్, ఆతుకూరి నాగేశ్వరరావు, జానీ బాషా, సయ్యద్ పెద కరిముల్లా, గుంటూరు ఆశీర్వాదం, పత్తిపాటి హరేకృష్ణ, పోతుగంటి రామకోటేశ్వరరావు, రాంబో బుడే, మాబూ తదితర టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగంటివారిపాలెం, ఇరుకుపాలెం గ్రామాల్లో నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముప్పాళ్ళలో మైనార్టీ సెల్ నేత ఎస్ఎం సైదా ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు గంగారామ్ ఖాశిం, అబ్దుల్ మజీద్, బాషా, నాము శివ, శ్యామ్ సన్, కందుల మనోజ్, డీవీ నారాయణ, నాగుల తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం, గణపవరం, నెమలి పురి, బలిజేపల్లి, రెడ్డిగూడెం తదితర గ్రామాలలో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, పూజల వెంకటకోటయ్య, అంకాళ్ల ప్రభుదాసు, చొక్కా శ్రీను, వర్ల శ్రీను, శనగపూల నరసింహరావు, నల్లగొర్ల సాంబశివరావు, తోట శ్రీను, సర్పంచ్ కుందూరు పేతురు, లంకా వీరయ్య, మాజీ సర్పంచ్‌లు పులిబండ్ల సాంబశివరావు, వాసా వెంకటేశ్వర్లు, నర్రా మల్లయ్య, నర్రా ఆంజనేయులు, మొరసా శ్రీను, గడేమ వెంకట్రావు, నల్లమోతుల శ్రీనివాసరావు, అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అచ్చంపేట,(ఆంధ్రజ్యోతి): తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీ రామారావు అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని రుద్రవరం గ్రామంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ స్ఫూర్తితో నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తానని, సుపరిపాలనను అందిస్తానని అన్నారు. కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ రాష్ట్రం లోనేకాక, దేశంలోని రాజకీయ వేత్తలందరికీ ఆదర్శప్రాయుడని కీర్తించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, బిక్కి సీతయ్య, కిలారి రాజన్ బాబు, మద్దిరాల గంగాధర్, నల్లమేకల వెంకటేశ్వర్లు, ఘంటా ఉషా రాణి, సీహెచ్ రమేష్, వేగుంట రాణి, మాగులూరి భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు,(ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడులో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్, ఎన్ఆర్ఐ భాను ప్రకాష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు బెల్లంకొండ రామగోపాలరావు, మద్దిరాల గంగాధర్, భాష్యం ఆంజనేయులు, షేక్ ముంతాజ్, వడ్లమూడి అప్పారావు, షేక్ చాంద్ బాషా పలువురు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోనూ ఎన్‌టీఆర్ వర్ధంతిని నిర్వహించారు.



అమరావతి, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో టీడీపీ నేతలు, ఎన్టీఆర్ అభిమానులు ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ధరణికోట గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది విష్ణు ఆ పార్టీ శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

క్రోసూరు,(ఆంధ్రజ్యోతి): క్రోసూరులో ఎన్టీఆర్ విగ్రహానికి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు కాంధ్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరావు, రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి వేగుంట రాణి తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుడిపాడుబాషా నేతలు నలజాల కోటేశ్వరరావు, మన్నెం శ్రీనివాసరావు, దుద్దుల యోహాన్, అనుముల వెంకట రామిరెడ్డి, పూర్ణ, డీ సాంబశివరావు, వెంకటరావు, లక్ష్మయ్య, రాంబాబు, బండారు మైసూర్‌బాబు, షేక్ ముస్తఫా, సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోలివాగు వంతెనపై త్వరలో రాకపోకలు

- హైలెవల్ బ్రిడ్జి పనులు తుది దశకు
- పరిశీలించిన ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల,జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గోలి వాగుపై చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు తుది దశకు చేరాయని, ఈ నెల 28 నుంచి రాక పోకలు ప్రారంభమౌతాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. 167 ఏడీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చేపట్టిన గోలి వాగు బ్రిడ్జి పనులను శనివారం ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గోలి వాగు బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం రూ.1.8 కోట్లు కేటాయించిందని, జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా ఈ పనులు జరుగుతున్నాయన్నారు రెంటచింతలకు 5 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయడం వలన ట్రాఫిక్ స్తంభించే అవకాశం లేదన్నారు. గోలి వాగులో 5 కానాలు వాటిపై 25 గడ్డర్లు ఏర్పాటు చేశామని ఇప్పటి నుంచి వాగు పొంగి పొర్లడం ట్రాఫిక్ స్తంభించిందమనేది వుండదని ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు. గోలి వాగు నీరు వృథా కాకుండా లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ఈ పథకం వలన 2 వేల ఎకరాలకు సాగునీరందించవచ్చన్నారు. 3300 ఎకరాల్లో వున్న బుగ్గవాగు రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 5 టీఎంసీలకు పెంచే ప్రతిపాదన పరిశీలనలో వుందని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో పాలువాయి సర్పంచ్ మందలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి, మందలపు హనిమిరెడ్డి, మాజీ ఎంపీపీ ఎస్ నాగమ్మనర్సిరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ టీ.కోటిరెడ్డి, మాజీ పీహెచ్‌సీ చైర్మన్ బోడపాటి రామకృష్ణ, అల్లం బ్రహ్మారెడ్డి, సుధాకరరెడ్డి, పోట్ల సతీష్, రామకోటిరెడ్డి, నాళం పెదబాబు, ఎం.కిరణ్, సాంబశివరావు, వెంకట్రామిరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

విద్యుత్ బకాయిలు చెల్లించాలి

- విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయకుమార్

పిడుగురాళ్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల, మాచర్ల, నరసరావుపేట డివిజన్‌లలోని విద్యుత్ వినియోగదారుల బకాయిలను ఎప్పటికప్పుడు వసూలు చేయాలని విద్యుత్‌శాఖ పల్నాడుజిల్లా ఎస్ఈ పీ. విజయకుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కొండమోడు విద్యుత్‌శాఖ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.ఎస్సీఎస్టీ కాలనీల్లోని వినియోగదారులు పీఎం సూర్య ఘర్‌కోసం ఈనెల 21లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవా లన్నారు. సమావేశంలో నరసరావుపేట ఈఈరాంబొంట్లు, శ్రీనివాసులురెడ్డి, రామ సుబ్బారావు, నాగసురేష్‌బాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఆస్పత్రికి కుర్చీలు అందజేత

పెదకూరపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి మండల తెలుగు యువత అధ్యక్షుడు గల్లా శివ నాగరాజు శనివారం 10 కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ గుడిపూడి చిన రాజు, మక్కెన సాగర్, మండల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వాడవాడలా 'స్వచ్ఛదివస్'

సత్తెనపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం సత్తెనపల్లి పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో స్వచ్ఛదివస్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ చలంచర్ల లక్ష్మీతులసీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో తురగ మేరీ గ్రేస్, నెట్టెం సాంబశివరావు, సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది, పురపాలక సంఘంలోని వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయ ఆవరణలో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలను ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, ఏవో చంద్రారెడ్డి తదితర రెవెన్యూ సిబ్బంది శుభ్రం చేశారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో స్వచ్ఛ దివాస్ నిర్వహించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ రాధా, ఏవో భవానీ దేవి, ఏరియా వైద్యశాల డాక్టర్లు, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు, పాల్గొన్నారు.

ముప్పాళ్ళ (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది కార్యాలయ పరిసర ప్రాంతాలను శుభ్రంచేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ ఎన్ భవానీ శంకర్, సిబ్బంది, ఎస్ఐ సోమేశ్వరరావు, సిబ్బంది పరిసరాలను శుభ్రం చేసి ప్రతిజ్ఞ చేశారు.

మాచవరం,(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ నేతలు, ఎంపీడీవో వెంగళరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు,(ఆంధ్రజ్యోతి): క్రోసూరులో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛతదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతను ప్రచారం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. అమరావతి బస్టాండ్ సెంటర్‌లో అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు మానవహారం నిర్వహించారు. ఎంపీడీవో జీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల ప్రాంగణాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. ఎంపీపీ కోటయ్య, సర్పంచ్ చందమామ, పంచాయతీసెక్రటరీ వెంకయ్య, వివిధ శాఖల అధికారులతో పాటు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంధ్రు కాశయ్య, టీడీపీ నాయకులు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లి పట్టణంలో స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివాస్ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన ర్యాలీ

రెంటచింతల, (ఆంధ్రజ్యోతి): పల్లె సీమల ఆరోగ్యమే లక్ష్యంగా ఆహ్లాదకరంగా ఉండేలా స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందిస్తుందని ఎంపీడీవో కె.సరోజనీదేవీ అన్నారు. శనివారం అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాల విద్యార్థులతోకలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో పరిశుభ్రత పాటిస్తామంటూ స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏపీవో జయచంద్ర, మిట్టగుడిపాడు సర్పంచ్ గొట్టం ప్రమీలాగురవారెడ్డి,కార్యదర్శి కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, రాజారెడ్డి, బోడపాటి రామకృష్ణ, రాయపరెడ్డి, శౌరైడ్డి, కోరే నాగేశ్వరరావు, మల్లారెడ్డి, చేరెడ్డి కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, మీరా, లింగా మాధవరావు, సతీష్, లింగయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

కట్నం కోసం వేధిస్తున్నాడని భర్త పై కేసు

సత్తెనపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని భర్త షేక్ ఇలియాజ్‌పై క్రోసూరు పీహెచ్‌సీలో పనిచేస్తున్న షేక్ ఫాతిమా బేగం శనివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని పోలీసులు తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు వివాహ సమయంలో ఇలియాస్‌కు ఫాతిమా బేగం కుటుంబ సభ్యులు కట్నం కింద రూ.15 లక్షలు నగదు, రూ.3 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు ఇచ్చారు. ఇప్పుడు ధూళిపాళ్ళలో తన పేరుపై ఉన్న పొలాన్ని కూడా అమ్మి ఇవ్వాలని ఇలియాస్ అతని కుటుంబ సభ్యులు ఒత్తిడి తెస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని ఫాతిమాబేగం ఫిర్యాదులో పేర్కొందని తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ముందుగా ఆమె తన కుమార్తెతో కలిసి కొద్దిసేపు ఆందోళన చేశారు.

మిరప తోటల పరిశీలన

అచ్చంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలెం, కొత్తపల్లి, అచ్చంపేట, నీలేశ్వరం గ్రామాల్లోని మిరప తోటలను ఉద్యానశాఖ అధికారి శ్రీనిత్య రైతులతో కలసి పరిశీలించారు. తోటల్లో నల్ల తామర ఉందని, ఇందులో భాగంగా దీని నివారణకు పిప్రోనేల్ ఐదు శాతం 2.5 ఎంఎల్ లీటరు నీటితో పాటు బ్లూ, తెలుపు రంగు జిగురు పూసిన అట్టలను ఎకరానికి 30 చొప్పున పెట్టుకోవాలని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎండు తెగులు నివారణ కోసం మెటల్ ఆక్సిల్‌లాంటి సిలీంద్ర సంహారులను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి భూముల రీసర్వే ప్రారంభం

పిడుగురాళ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూముల రీసర్వేను సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ జే మధుబాబు తెలిపారు. జానపాడు గ్రామంలో రీసర్వే జరుగనున్న పొలాలను, మ్యాప్‌ను పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. సిబ్బందిని బాగాలుగా విభజించి రీసర్వేను వేగంగా పూర్తయ్యేలా సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. సర్వే నెంబర్ల ప్రకారం సరిహద్దులను గుర్తించే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకరశర్మ, ఆర్ఐ శ్రీనుబాబు, సీఎస్‌డీటీ సుబ్బారావు, అన్ని గ్రామాల వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పెయింటర్ మృతి

దాచేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అపార్టుమెంట్‌కు రంగులు వేస్తూ జ్వాలా తాడు తెగి పెయింటర్ మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని దావత్ రెస్టారెంట్ సమీపంలోని అపార్టుమెంట్‌కి పెయింట్ వేసే పనికి భవన నిర్మాణ కార్మికుడు కరిముల్లా (36)వెళ్లాడు. జ్వాలా తాడుపై కూర్చొని పెయింటింగ్ పనిచేస్తుండగా తాడు తెగిపోవడంతో కరీముల్లా కిందపడి, తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు

బెల్లంకొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో రాష్ట్ర మైనార్టీసెల్ ప్రధానకార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, టీడీపీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పాపాయపాలెం, నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నేతలు నివాళులు అర్పించారు.

గుంటూరు:



స్మార్ట్ హెల్మెట్ ప్రాజెక్టుతో సందుపాలెం దర్గా, గైడ్ టీచర్ ఎస్వీ రామాంజనేయులు


గగన్‌యాన్ ప్రాజెక్టుతో శారదానికేతన్ విద్యార్థిని ఈర్షిత, అనిశాబేగం

వారెవ్వా.. బాల శాస్త్రవేత్తలు

- వైజ్ఞానిక ప్రదర్శనలో అబ్బురపరిచిన విద్యార్థులు
- జాతీయ స్థాయి పోటీలకు పలు ప్రాజెక్టులు ఎంపిక
- రేపటి నుంచి పుదుచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి ప్రదర్శనలో చోటు

(బాపట్ల, గుంటూరు(విద్య), దాచేపల్లి - ఆంధ్రజ్యోతి)

వినూత్న ఆలోచనలకు వైజ్ఞానిక సృజన జోడిస్తే అద్భుతాలు సాధించవచ్చని ఆ విద్యార్థులు నిరూపించారు. విజయవాడ వేదికగా ఈ నెల 7, 8 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి పలువురు విద్యార్థులు వివిధ అంశాలపై ప్రాజెక్టులను ప్రదర్శించారు. వాటిలో జిల్లాకు రెండేసి చొప్పున ప్రాజెక్టులను జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. ఆయా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. ఆ ప్రాజెక్టులను ప్రదర్శించిన బాల శాస్త్రవేత్తల ఆలోచనలను పలువురు అభినందించారు. సైన్స్ ప్రదర్శనలతో పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి సత్తాచాటిన విద్యార్థులు ఈ నెల 21 నుంచి 25 తేదీ వరకు పుదుచ్చేరిలో జరిగే జాతీయ స్థాయిలో పోటీలకు సిద్ధమయ్యారు. విద్యార్థులు ఈ ప్రాజెక్టుల రూపకల్పన కోసం నెల రోజుల పాటు శ్రమించారు. ప్రదర్శనలో ఉత్తమంగా ఉండాలంటే తొలుత అత్యున్నతమైన ఐడియా కోసం టీచర్లతో కలిసి విద్యార్థులు మేధోమధనం చేశారు. ఇప్పుడు ఈ విద్యార్థులు జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించేందుకు వారికి ఉపాధ్యాయులు సహకరిస్తున్నారు.

రైతుల కోసం..

మల్టీపర్పస్ అగ్రికల్చర్ మెషిన్ ప్రాజెక్టును సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సాయిరామ్ ధీరజ్, కె.వెంకటేష్ రూపొందించారు. దీని వల్ల రైతులు పురుగుమందులు పిచికారి చేయడం సులభం అవుతుంది. ట్యాంకును ట్రాలీ మీద ఉంచి చేతితో నెట్టడం తద్వారా ఆక్సిలేటర్ మోషన్ అండ్ చైన్ మెకానిజమ్ ద్వారా ఇది ఆపరేట్ అవుతుంది. ఎలాంటి ఇంధనం అవసరం లేకుండానే కేవలం రైతులు చేతితో నెట్టడం ద్వారానే దీనిని వాడుకోవచ్చు. కేవలం రూ.5,000తో దీనిని రైతులకు అందుబాటులోకి తేవచ్చు. పొలాలకు మందుకోసం ఇప్పుడు వాడుతున్న స్ప్రేయర్ల వల్ల రైతుల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. దీనికి పరిష్కారంగానే ఈ ప్రాజెక్టుని రూపొందించాం.

వాతావరణం అంచనా వేసేలా

స్మార్ట్ అండ్ సేఫ్ అగ్రికల్చర్ ప్రాజెక్టును బాపట్ల మండలం నర్సాయపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని జి.ప్రత్యూష రూపొందించారు. దీనితో వాతావరణ పరిస్థితులను అంచనా వేయవచ్చు. రైతులకు ఇదే ఉపయోగపడుతుంది. వెదర్, టెంపరేచర్ సెన్సార్లు దానిలో అమర్చాం. విత్తు నాటింది మొదలు కోతల వరకు ఏ సమయం అనుకూలమో రైతులే స్వయంగా తెలుసుకోవచ్చు. తుఫాన్ల సమయంలో కరెంటు స్థంభాలు పడిపోయి రైతులు చనిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ పరికరం ద్వారా ముందుగానే డిఫాల్ట్ ఉన్న స్థంభాలను గుర్తించి సదరు విభాగాన్ని అలర్ట్ చేయడానికి ఈ ప్రాజెక్టు ఉపకరిస్తుంది.

సోలార్ స్మార్ట్ హెల్మెట్

ద్విచక్రవాహన ప్రమాదాల్ని నిలువరించేందుకు ముట్లూరుకు చెందిన సందుపాలెం దర్గా గైడ్ టీచర్ వీఎస్ రామాంజనేయులు ఆధ్వర్యంలో సోలార్ స్మార్ట్ హెల్మెట్ తయారు చేశారు. ఈ హెల్మెట్ ధరిస్తేనే బైక్ స్టార్ట్ అయ్యేలా దీనిని రూపొందించాను. మద్యం తాగినా హెల్మెట్‌లో సెన్సార్స్ ద్వారా గుర్తిస్తుంది. కొత్తగా బైక్‌లు విక్రయించే కంపెనీలు ఈ హెల్మెట్‌తో విక్రయిస్తే ప్రమాదాలు తగ్గుతాయి. అంతేకాదు ఈ హెల్మెట్‌కు బ్లూటూత్, సంగీతం వినేలా ఏర్పాట్లు ఉన్నాయి. నావిగేషన్, మొబైల్ చార్జింగ్ కోసం సోలార్ కమ్యూనికేషన్ సిస్టమ్ అందుబాటులో ఉంటుంది. ,

పది విద్యార్థుల కోసం

పదో తరగతి భౌతిక శాస్త్రంలో విద్యుదయస్కాంతత్వం అనే పాఠ్యాంశాన్ని విద్యార్థులు కష్టంగా భావిస్తారు. దీనిని గమనించి జీజీపాలెం జడ్పీస్కూల్ ఉపాధ్యాయుడు గనివి శ్రీనివాసరావు పాఠాలకు సంబంధించిన విషయాలు సులభంగా నేర్చుకునేలా ప్రాజెక్టు తయారు చేశారు. విద్యుత్ ప్రవాహం వల్ల అయస్కాంత క్షేత్రం, సరళరేఖలా ఉన్న విద్యుత్ అయస్కాంత క్షేత్రం, వలయాకారపు తీగచుట్టవల్ల ఏర్పడే అయస్కాంత క్షేత్రం, సాలినాయిడ్ వల్ల ఏర్పడే అయస్కాంత క్షేత్రాలను ప్రాజెక్టు రూపంతో తీసుకు వచ్చి విద్యార్థులకు వివరించే ప్రయత్నం చేశారు.

సేవ చేసే రోబోట్

ఆపద సమయంలో సేవ చేసేలా రోబోట్‌ను నారాకోడూరు జడ్పీ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థిని నజ్మా రూపొందించారు. రోగులకు ఆహారం, మందులు అందించడానికి వీలుగా ఈ రోబోట్‌ను రూపొందించారు. దివ్యాంగులకు, హోటల్స్‌లో, మాల్స్‌లో ఆహార పదార్థాలు పంపిణీ చేయడానికి ఈ రోబోట్‌ను ఉపయోగించవచ్చు. మనిషి శ్రమను తగ్గించేలా దీనిని రూపొందించారు.

గగన్‌యాన్

ఇస్రో అంతరిక్షంలోకి ముగ్గురితో కూడిన బృందాన్ని పంపిన వివరాలు తెయలిజేస్తూ శారదానికేతన్ ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు ఎండీ అనిషాబేగం, ఎస్ ఈర్షితలు గగన్‌యాన్ ప్రాజెక్టు రూపొందించారు. ఈ ప్రాజెక్టు గగన్‌యాన్‌కు సంబంధించి పూర్తిస్థాయి సమాచారం తెలియజేస్తుంది.

ఆస్తమా రోగుల కోసం..

ఆస్తమా రోగులకు అత్యవసర సమయాల్లో శ్వాస అందించేందు కోసం అంబు బ్యాగ్‌ను దాచేపల్లి జడ్పీ హెచ్ఎస్ విద్యార్థి ప్రజాపతి దిలీప్ రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. ప్రస్తుతం ఆస్మా రోగులకు ఉపయోగపడే కృత్రిమ శ్వాస మిషన్ కొనుగోలు చేయాలంటే రూ.3 లక్షల వరకు వెచ్చించాలి. అయితే కేవలం రూ.3 వేలు వెచ్చించి డ్రిల్లింగ్ మిషన్, పిస్టన్, ప్రజర్ బ్యాగ్ ఉపయోగించి అంబు బ్యాగ్‌ను తయారు చేశారు. ఇది రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.


సేవ చేసే రోబోట్ నమూనాతో నారాకోడూరు జడ్పీస్కూల్ విద్యార్థిని నజ్మ


గనివి శ్రీనివాసరావు రూపొందించిన అయస్కాంత క్షేత్రాల ప్రాజెక్టు


మల్టీపర్పస్ అగ్రికల్చర్ మెషిన్ ప్రాజెక్టుతో గ్రూపు విద్యార్థులు కె.వెంకటేష్, సీహెచ్‌సాయిరామ్ ధీరజ్, గైడ్ టీచర్ మోహనాంజలి

బాపట్ల:


స్మార్ అండ్ సేఫ్ అగ్రికల్చర్ ప్రాజెక్టుతో ప్రత్యూష, గైడ్ టీచర్ పి. వినీత


దాచేపల్లి: అంబు బ్యాగ్ నమూనాను ప్రదర్శిస్తున్న దాచేపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థి ప్రజాపతి దిలీప్

అపూర్వ కలయిక

- 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న వైద్యులు
- జీఎంసీ 1975వ బ్యాచ్ స్వర్ణోత్సవ సంబరాలు

గుంటూరు మెడికల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వారంతా గుంటూరు వైద్య కళాశాలలో 1975వ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులు. దేశ విదేశాల్లో వైద్యవృత్తిలో రాణిస్తున్నారు. వైద్య విద్యలో ప్రవేశించిన యాభై ఏళ్ల తర్వాత శనివారం వారంతా గుంటూరు వైద్య కళాశాలలో కలుసుకున్నారు. మిత్రులను చూసి పాత జ్ఞాపకాలను తలచుకుని పులకించిపోయారు. శనివారం జింకానా ఆడిటోరియంలో జీఎంసీ 1975వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాటి బ్యాచ్‌కు చెందిన బీవీ విజయ్‌కుమార్, కేవీఎన్ శివకుమార్, ఎన్నారై తేజానంద్‌గౌతమ్ మూల్పూరి, జీ సూర్యప్రకాశ్, ఈశ్వర్, ఇందిరా కుమారి, సుజాత, వై అజిత్‌బాబు, రవిప్రసాద్, పీ ఆదివిష్ణు, ఆదినారాయణలతో పాటు పలువురు ఈ సంబరాల్లో పాల్గొన్నారు. విద్యాభ్యాసం నాటి పాత జ్ఞాపకాలను మరోసారి నెమరు వేసుకున్నారు. ఇకపై ప్రతి రెండేళ్లకు ఒకసారి జీఎంసీలో కలుసుకోవాలని తీర్మానించారు. విద్యాబుద్ధులు నేర్పి మంచి వైద్యులుగా ఎదిగేందుకు దోహదం చేసిన తమ నాటి గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం కూడా 75వ బ్యాచ్ స్వర్ణోత్సవ సంబరాలు కొనసాగుతాయి.


జింకానా ఆడిటోరియంలో 1975వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు

- కెడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అనుమతి


జీవన్‌దాన్ అనుమతి పత్రంతో రమణ యశస్వి, వైద్యులు

గుంటూరు మెడికల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలకు అనుమతి లభించింది. మృతదేహాల నుంచి సేకరించిన కాలేయం మాత్రమే (కెడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) నిర్వహించేందుకు అనుమతి ఇస్తూ ఏపీ జీవన్‌దాన్ ట్రస్ట్ చైర్మన్ ఉత్తర్వులు జారీ చేశారు. హ్యూమన్స్ ఆర్గాన్స్ యాక్ట్ 1994, ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ యాక్ట్ 1995 ప్రకారం అనుమతులు జారీ చేసినట్లు వైద్య విద్య సంచాలకుల కార్యాలయం నుంచి శనివారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వికి అధికారిక సమాచారం అందింది. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ల నిర్వహణకు అనుమతివ్వాలని కోరుతూ ప్రభుత్వ సమగ్రాస్పత్రి వైద్యులు 2023 ఆగస్టులో ట్రస్ట్‌కు రాతపూర్వంగా విజ్ఞప్తి చేశారు. అనంతరం ట్రస్ట్ నుంచి నిపుణులు జీజీహెచ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగాన్ని సందర్శించి తనిఖీలు చేశారు. సర్జికల్, మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్టులు అందుబాట్లో ఉండటం, ఇతర సౌకర్యాలు కూడా ఉన్నట్లు గుర్తించడంతో కాలేయ మార్పిడి ఆపరేషన్లకు అనుమతులు లభించాయి. మూడేళ్ల వరకు ఇది వర్తిస్తుంది. త ర్వాత కమిటీ మరోసారి తనిఖీలు చేసి రెన్యువల్ చేస్తేనే, ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు కొనసాగుతాయి. జీవన్‌దాన్ ట్రస్ట్ నుంచి అనుమతులు లభించడంతో జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సల నిర్వహణకు వైద్యాధికారులు సన్నద్ధమవుతున్నారు. ప్రైవేటు వైద్యరంగంలో కాలేయ మార్పిడి ఆపరేషన్‌కు రూ.25 లక్షల వరకు ఖర్చు అవుతుంది. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఉచితంగా ఈ ఆపరేషన్లు చేస్తారు. కాలేయ మార్పిడి కోసం ఎదురుచూసే పేద రోగులకు ఇది ఎంతో మేలు చేస్తుందని చెప్పవచ్చు. ఇప్పటికే జీజీహెచ్‌లో మూత్రపిండాల మార్పిడి, గుండె మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా కాలేయ మార్పిడి సర్జరీలకూ అనుమతి లభించింది.

ఐదు నెలల్లో చినకాకాని - గుండుగొలను బైపాసు

- శంకర్‌విలాస్ ఆర్వోబీకి ఏప్రిల్ మొదటి వారంలో శంకుస్థాపన
- ఔటర్ రింగ్‌రోడ్డుకు రూ.20 వేల కోట్ల వరకు నిధులు
- దిశా సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని



కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు, అధికారులు

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చినకాకాని - గుండుగొలను బైపాసు రోడ్డుని ఐదు నెలల్లో పూర్తి చేసి హైదరాబాద్ జాతీయ రహదారిని అమరావతికి అనుసంధానం చేస్తామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశా) సమావేశం శనివారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో డాక్టర్ పెమ్మసాని సమీక్షించి పలు సూచనలు అందజేశారు. గత ప్రభుత్వంలో నిలిపివేసిన అండర్ పాస్ బ్రిడ్జీలు 2026 జూలై నెలాఖరుకు పూర్తి చేస్తామని అధికారులు మంత్రికి తెలిపారు. త్వరలో నందివెలుగు బ్రిడ్జి పనులు మొదలు పెడతామన్నారు. శంకర్ విలాస్ ఆర్వోబీకి ఏప్రిల్ మొదటి వారంలో శంకుస్థాపన చేస్తామని మంత్రి తెలిపారు. జాతీయ రహదారుల విస్తరణ కోసం భూ సేకరణ డీపీఆర్‌ల రూపకల్పనపై అధికారులతో సమీక్షించారు. జాతీయ రహదారుల నిర్మాణం, ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం 2026 జనవరి నాటికి పూర్తి చేస్తామన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు విషయంలో రెండు నెలల లోపు పూర్తి అలైన్‌మెంట్ చేస్తామని అధికారులు మంత్రికి తెలిపారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు పనులకు వచ్చే నెల టెండర్లు పిలుస్తామన్నారు. రైల్వే బ్రిడ్జిల నిర్మాణాన్ని రూ.110 కోట్లతో చేపడతామన్నారు. ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అమృత్ - 2 వాటర్ స్కీమ్‌కు డీపీఆర్‌లు సిద్ధం చేశామని పరిశీలన దశలో ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో పీఎంజీఎస్‌వై పథకం కింద 12 రోడ్ల నిర్మాణానికి సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు.

మూడు నెలలకోసారి సమీక్ష..

గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరిగే పథకాలను ప్రజాప్రతినిధుల, అధికారులతో ప్రతి మూడు నెలలో కొకసారి దిశా సమావేశంలో సమీక్షిస్తామని మంత్రి పెమ్మసాని విలేకర్ల సమావేశంలో తెలిపారు. అసంపూర్తిగా వున్న నందివెలుగు బ్రిడ్జి కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు రూ.10 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. మరో రూ.30 కోట్లు అయితే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయవచ్చన్నారు. ఇందుకు సంబంధించి డీపీఆర్‌లు సిద్ధం చేయమని అధికారులను ఆదేశించామన్నారు. శ్యామలనగర్ బ్రిడ్జిని రెండు లైన్లకు పరిమితం చేయడం జరిగిందన్నారు. మంగళగిరి, పెదపలకలూరు బ్రిడ్జిలకు డీపీఆర్‌లు పూర్తి అయ్యాయని, వాటిని రైల్వే అధికారులకు పంపామన్నారు. అమృత్ - 2 పథకం కింద రూ.184 కోట్లతో ఒకటి, రూ.25 కోట్లతో మరొక ప్రాజెక్టుకు చేపట్టే కార్యక్రమంపై సమీక్షించామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పరిస్థితిపై సమీక్షించామన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డుకు రూ.17 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు నిధులు వస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో షేక్. ఖజావలి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, వివిధ శాఖల జిల్లా, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమిటీలపై కసరత్తు

(5వ పేజీ తరువాయి)

గుర్తించారు. వీటిని సరిదిద్దిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. 2018 నుంచి ఎన్నికలు నిర్వహించలేదు. అప్పట్లో సొసైటీల అధ్యక్షుల పదవీ కాలం 2019 వరకు పొడిగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సొసైటీలకు ఎన్నికలు నిర్వహిస్తారని రైతులు ఆశించారు. అయితే సొసైటీల వారీగా సభ్యులను గుర్తించాల్సి ఉంది. కొత్త ఓటర్ల జాబితాల రూపకల్పనలో జాప్యం జరిగే అవకాశం ఉండటంతో త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 168 సహకార సంఘాల్లో 12,31,363 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఎన్నికలు నిర్వహిస్తేనే సొసైటీలను బలోపేతం చేయడంతో పాటు రైతుల ప్రయోజనాలకు పెద్ద పీట వేసే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వం స్పందించాలని రైతులు కోరుతున్నారు.

వైసీపీ హయాంలో నిర్వీర్యం..

వైసీపీ ఐదేళ్ల పాలనలో సహకార రంగాన్ని నిర్వీర్యం చేశారు. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాల ఫలితంగా సహకార వ్యవస్థ ఆర్థి కంగా కుదేలైంది. సహకార రంగాన్ని ఐదేళ్ల దోచేశారు. నాబార్డు ద్వారా వచ్చిన నిధుల్ని కూడా పంచుకుతిన్నారు. రుణాల పంపి ణీలో కూడా అవకతవకలు పెద్దఎత్తున జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. కొన్ని సంఘాల్లో రూ.లక్షల్లో కుంభకోణాలు జరిగినట్లు ఇప్పటికే జరిగిన విచారణల్లో వెలుగు చూశాయి. చాలా సంఘాలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఎరువులు అమ్మకాలను సీరు గార్చి రైతు భరోసా కేంద్రాలకు అప్పగించారు. ఇంధన బంకులు, జన ఔషధి కేంద్రాలు ఇలా అన్నింటిలోనూ వైసీపీ వారికే ప్రాధాన్యం కల్పించారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా సొసైటీల్లో త్రిసభ్య పాలన విధానాన్ని ప్రవేశపెట్టింది. రైతులకు సొసైటీలకు మధ్య దూరం పెంచింది. ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలను నియమించింది. పార్టీ వ్యక్తులను నామినేషన్ పద్ధతిలో కమిటీలను ఎంపిక చేసింది. దీంతో సొసైటీలు పూర్తి రాజకీయ కేంద్రాలుగా మారిపోయాయి. సహకార సంఘాలు రాజకీయా లకు అతీతంగా పనిచేయల్సి ఉండగా వీటిలో మితిమీరిన రాజకీయ జోక్యంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. వైసీపీ బాటలోనే కూటమి ప్రభుత్వంఎన్నికలు నిర్వహించేందుకు ఆసక్తి చూపకపోవడంపై రైతుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- పండగకు 250పైనే ఏర్పాటు
- రద్దీ దృష్ట్యా శని, ఆదివారాల్లో 76 బస్సులకు ప్రణాళిక
- ఇప్పటికే రూ.70 లక్షల పైనే ఆదాయం

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూరింది. అధికారులు ముందుగా భావించినట్లుగానే ఆర్టీసీకి ప్రయాణికుల రద్దీ కనిపించింది. పండగకు గుంటూరుకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా 171 బస్సులను ఏర్పాటు చేశారంటే ప్రయాణికుల రద్దీ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ఇక కనుమకు తిరుగు ప్రయాణికులు పెద్దగా ఉండరని అధికారులు భావించినా అందుకు భిన్నంగా ప్రయాణికుల జోరు కనిపించింది. దాంతో కనుమ, తరువాత రోజు రెండు రోజులు ప్రయాణికుల రద్దీతో 75 బస్సుల వరకు సమకూర్చారు. పండగకు గుంటూరుకు వచ్చే ప్రయాణికుల కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, వైజాగ్ నుంచి గుంటూరుకు 171 బస్సులు ఏర్పాటు చేశారు. దాంతో ఆర్టీసీకి రూ.45లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక పండగ ముగిసిన తరువాత తిరుగు ప్రయాణికుల కోసం అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు. అయితే కనుమ రోజు పెద్దగా రద్దీ ఉండదని భావించినా కనుమ రోజు రాత్రి, తరువాత రోజు రెండు రోజులు అదనంగా 75 బస్సులు ఏర్పాటుచేశారు. తద్వారా మరో రూ.25 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు చెబుతున్నారు. కాగా విద్యాసంస్థలు సోమవారం నుంచి పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో శని, ఆదివారాలు రాత్రి గుంటూరు నుంచి తిరుగు ప్రయాణమయ్యే వారు, వచ్చే వారి రద్దీ ఎక్కువగా ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇందు కోసం అదనంగా మరో 75 సర్వీసులు ఏర్పాటు చే సేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

ప్రణాళిక సిద్ధం

పండగకు వచ్చిన ప్రయాణికులు గుంటూరు నుంచి తిరుగు పయనమయ్యేందుకు శని, ఆదివారం రాత్రులు వెళ్లనున్నారు. ఇందుకోసం అదనంగా మరో 75 సర్వీసులు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశాం. ఎప్పటికప్పుడు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసులను ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి మానిటరింగ్ చేస్తున్నాం.

- జిల్లా ప్రజారవాణాధికారి రవికాంత్


ప్రయాణికులతో రద్దీగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

- రూ.84.5 లక్షల విలువైన 1.206 కిలోల బంగారు ఆభరణాలు స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల దొంగలను అరెస్ట్ చేసిన శ్రీకాకుళం పోలీసులు రూ.84.44 లక్షల విలువైన బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం ఈ వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పత్తికాయలవలస గ్రామానికి చెందిన పున్నాన రాంబాబు విజయవాడలో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. క్రికెట్ కోచింగ్ తీసుకుని రంజీలోకి ఎంపిక కాక, చెడువ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో విజయవాడ, గుంటూరు, ఎస్.కోట, రాజాం, విజయనగరం, చీపురుపల్లి, రణస్థలం, లావేరుతో పాటు రాష్ట్రంలో పలు పోలీసు స్టేషన్ల పరిధిలో 30 పైగా కేసుల్లో జైలుకు వెళ్లాడు. 2022 జూన్‌లో అరెస్టై గతేడాది జనవరి 10న విశాఖపట్నం సెంట్రల్ జైలు నుంచి విడుదలైన రాంబాబు, జైలులో పరిచయమైన శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం గెడ్డ కంచరాం గ్రామానికి చెందిన గిడిజాల కోటేశ్వరరావుతో కలిసి నేరాలకు పాల్పడేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో ఐదున్నర తులాల బంగారు కాసుల పేరు, ఒక తులం బంగారు చైన్ పోయినట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ నెల 17న ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలస కూడలిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాంబాబు, కోటేశ్వరరావును విచారించగా అసలు విషయం బట్టబయలైంది. జిల్లాలో ఏకంగా 32 చోట్ల దొంగతనాలకు పాల్పడినట్టు వారిద్దరూ అంగీకరించారు. వీరి నుంచి రూ.84,44,800 విలువ చేసే 1.206 కిలోల బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. ఇంకా మరో 250 గ్రాముల బంగారం బ్యాంకులో తాకట్టులో ఉందని, వాటిని కూడా స్వాధీనం చేసుకుంటామని ఎస్పీ వివరించారు.

జలవనరుల శాఖ ఎస్ఈగా కేవీ రమణారెడ్డి

నరసరావుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ లింగంగుంట్ల ఓఅండ్ఎం సర్కిల్ ఎస్ఈగా కేవీ రమణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఓఅండ్ఎం ఈఈ కృష్ణమోహన్ ఎస్ఈగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన ఈఈగా కొనసాగనున్నారు. రమణారెడ్డి వచ్చే వారంలో విధుల్లో చేరనున్నట్టు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఓ ఉపాధ్యాయుడిపై హోంమంత్రికి ఫిర్యాదు



హోంమంత్రి అనితతోపాటు ఎమ్మెల్సీ అశోక్‌బాబుకు ఫిర్యాదు చేస్తున్న ఎన్జీ అసోసియేషన్ నాయకులు

వినుకొండటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం పేరుతో విరాళాలు సేకరిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలంటూ నోబుల్ టీచర్స్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బీవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో హోం మంత్రికి ఫిర్యాదు చేశారు. టీడీపీ జాతీయ కార్యాలయంలో హోంమంత్రి అనితను శనివారం వారంతా కలిసి ఫిర్యాదు చేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన ఓ ఉపాధ్యాయుడు 2022వ సంవత్సరం రద్దయిన తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం పేరుతో విరాళాలు సేకరిస్తున్నాడని, అధికారులను, ఉపాధ్యాయులను మభ్యపెడుతూ టీఎన్‌యూఎస్ టీడీపీకి అనుబంధ సంఘమని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఫిర్యాదుపై స్పందించిన మంత్రి వెంటనే ఒంగోలు ఎస్పీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు నోబుల్ టీచర్స్ నాయకులు తెలిపారు.

20వతేదీ నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

ఈపూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20వతేదీ నుంచి ఈపూరు, బొల్లాపల్లి మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీఏ పీ శ్రీనివాసమూర్తి శనివారం తెలిపారు. శిబిరాల్లో పశువులకు చూడి పరీక్షలు, ఎదకు రాని పశువులకు చికిత్స, నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తామన్నారు. అందుకోసం పశువైద్యులు, సిబ్బంది ఐదు టీంలుగా ఏర్పడి ఈపూరు ప్రాంతీయ పశువైద్యశాల పర్యవేక్షణలో శిబిరాలు నిర్వహిస్తారన్నారు. శిబిరాల్లో పాడిరైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తారన్నారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

'ఉల్లాస్‌'పై అవగాహన కల్పించాలి

● డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ బాలునాయక్

నరసరావుపేట రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిరక్షరాస్యత నిర్మూలనకు ఉల్లాస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా పథక సంచాలకులు బాలునాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో చదువురాని వారు ఈ ఉల్లాస్ కార్యక్రమంలో పేర్లను నమోదు చేయించుకుని, క్రమం తప్పకుండా అక్షరాస్యత కేంద్రాలకు వెళ్లి చదువుకొని, సాధికారతను సాధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జగన్మోహనరావు, నోడల్ అధికారి మల్లికార్జునరావు, సూపర్ వైజర్‌లు శిరీష, రవి గోవర్ధన్, నాగేశ్వరరావు, జిల్లా సమాఖ్య ప్రతినిధులు, డీపీఎం హనుమానాయక్, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజు స్వామి చిత్రపటాలతో పట్టణంలో నగరసంకీర్తన

వినుకొండటౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కర్నాటక సంగీత విద్యాంసులు త్యాగరాజు స్వామి ఆరాధనోత్సవాలు పట్టణంలోని విశ్వహిందుపరిషత్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్యాగరాజు స్వామి చిత్రపటంతోపాటు శ్రీరామచంద్రునిస్వామి భారతమాత చిత్రపటాలను పుట్టాబత్తుని ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి మెయిన్‌బజారు మీదుగా వివిధ సత్సంగ సభ్యులు, పరిషత్ కార్యకర్తలు, భక్తుల భజనలతో నగరసంకీర్తన చేపట్టారు. అనంతరం కోదండరామస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు అందించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ జిల్లా అధ్యక్షుడు భాగవతుల రవికుమార్, గజవల్లి నాగపవన్‌కుమార్, శంకర్ సత్సంగం నిర్వాహకులు తెలగంశెట్టి పావని, పట్టణ పురోహితులు యడవల్లి శ్రీనివాసశర్మ, నల్లూరి పద్మ, యక్కల పూర్ణిమ, అడ్డగిరి లక్ష్మి, పెండేల రాజేశ్వరి, మల్లికార్జున, కొలిశెట్టి సుబ్బారావు, భవనాశి సాంబశివరావు భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ డైరీ బహూకరణ

చిలకలూరిపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్సు డిపోకు చెందిన ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శనివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును ఆయన నివాస గృహంలో కలిసి యూనియన్ ఎగ్జిక్యూటివ్ డైరీని బహుకరించారు. యూనియన్ నాయకులు అద్దంకి వరప్రసాదరావు, మువ్వా సుబ్బారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను వారు ఈ సందర్భంగా ప్రత్తిపాటికి వివరించారు.

9గంటల ఉచిత విద్యుత్‌కు ప్రభుత్వం కట్టుబడి ఉంది

● రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
● వైసీపీ అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలని హితవు
● టీడీపీ చీఫ్‌విప్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి



ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి 9గంటల ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఎన్‌టీర్ వర్ధంతి సందర్భంగా వినుకొండ పట్టణంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని శివయ్య స్థూపం, ఆర్టీసీ బస్టాండ్, విష్ణుకుండినగర్ వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన ఎన్‌టీర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు నివాళులు అర్పించారు. అనంతరం పెద్ద సంఖ్యలో పాల్గొన్న కార్యకర్తలతో కలిసి గంగినేని కల్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవితో లెజండరీ బ్లడ్ డొనేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన యువకులకు అభినందనలు తెలిపారు. అనంతరం వర్ధంతి సభలో మంత్రి గొట్టిపాటి రవిమాట్లాడుతూ పేదలు, బీసీల అభ్యున్నతి కోసం పార్టీని స్థాపించి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత దేశంలోనే ఎన్‌టీ రామారావుకే దక్కిందని కొనియాడారు. ఎన్‌టీ రామారావు బాటలో ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో కోటి మందికి పైగా సభ్యత్వాలు కల్గిన పార్టీ ఏదైన ఉందంటే అది ఒక్క తెలుగుదేశం పార్టీ అని కొనియాడారు. వ్యవసాయానికి 9గంటల ఉచిత విద్యుత్‌కు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాగుకు ఉచిత విద్యుత్ సరఫరాలో ఎలాంటి మార్పులు లేవ ని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. జగన్ సాక్షిని అడ్డం పెట్టుకొని నాడు స్మార్ట్ మీటర్లపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని, దీనిని తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వ

సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఎన్‌టీఆర్‌కే దక్కింది : చీఫ్‌విప్ జీవీ

ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పేదలు ఇళ్లు అంటే గుడిసెలు అనుకొనే రోజుల్లో శాశ్వత ఇళ్లు కట్టించిన మహానుభావుడు ఎన్‌టీఆర్ అని, ఆయన కళారంగం నుంచి రాజకీయ రంగంలోకి అడు గుపెట్టి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన గొప్ప నాయకుడు అని ఈ సందర్భంగా ఆయనను తలుచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. అధికారంలోకి వచ్చి న తొలినాళ్లలో మహిళలకు ఆస్తి హక్కులో సమాన హక్కులు కల్పించారన్నారు. ఎన్టీఆర్‌ను ఆదర్శంగా తీసుకొని ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను దేశంలోనే పలు రాష్ట్రాల్లో నేటికి అమలు చేస్తున్నారన్నారు. సందేశాత్మక సమాజానికి ఉపయోగపడే జన్మభూమి స్ఫూర్తితో దేశభక్తి భావాలతో గొప్పగొప్ప సినిమాలు తీశారని, తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● నియోజకవర్గంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 15 మంది కళాకారులను మంత్రి గొట్టిపాటి, జీవీ, మక్కెన తదితరులు సన్మానించారు.

వాడవాడలా ఎన్‌టీఆర్ 29వ వర్ధంతి

● టీడీపీ కార్యాలయాల్లో, గ్రామాల్లోని విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులు
● పలు ప్రాంతాల్లో అన్నదానాలు



టీడీపీ జిల్లా కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ, డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల తదితరులు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 18 (ఆంధ్ర జ్యోతి) : పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ 29వ వర్ధంతి శనివారం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎన్టీఆర్, కోడెల శివప్రసాదరావు చిత్రపటాలకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లడ్ డొనేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ పేదలకు ఆహారభద్రత, పక్కా ఆవాసం కల్పించడమే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల గుండెల్లో ఎన్టీఆర్ స్థిరనివాసం ఏర్పరచుకున్నారని అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొని నివాళి అర్పించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు బ్లడ్ డొనేషన్ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసినవారికి ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు. కాగా టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ కార్పొరేషన్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టాకిరణ్, వేల్పుల సింహాద్రియాదవ్, తెలుగురైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్ బాబు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ తాళ్ళూరి కుమార్, వాసిరెడ్డి రవి, మీరావలి, కపిలవాయి విజయకుమార్, శాఖమూరి రామ్మూర్తి, కనుమూరి లక్ష్మి, శారద, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ రోడ్‌లోని ఎన్టీఆర్ నగర్, ప్రకాష్ నగర్ 60 అడుగుల రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి, రిజిస్టర్ కార్యాలయం సమీపంలో, స్టేషన్‌రోడ్డులలోని అండర్ గ్రౌండ్ బ్రిడ్జి, 23, 24 వార్డులలోని పాత సమితి ఆఫీస్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. పాత సమితి కార్యాలయం వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఎన్జీవో కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. 20, 26, 27వ వార్డులోని ఎన్టీఆర్ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఆయా కార్యక్రమాల్లో రావెళ్ల నాగేశ్వరరావు, నల్లపాటి చిన్నబ్బాయి, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రామిరెడ్డిపేట. ఎన్జీవో కాలనీ తదితర సెంటర్‌లలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్ళుఅర్పించారు.

డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆస్పత్రిలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

నరసరావుపేట రూరల్, జనవరి 18: మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్‌టీఆర్‌విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. రావిపాడులో టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షుడు పూదోట సునీల్‌కుమార్ పాల్గొని ఎన్‌టీ ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సినీ, రాజకీయ రంగంలో ఎన్టీఆర్‌ది ప్రత్యేక స్థానం

● గోనుగుంట్ల కోటేశ్వరరావు

రొంపిచర్ల (ఆంధ్రజ్యోతి) : సినీ, రాజకీయ రంగంలో ఎన్‌టీఆర్‌ది ప్రత్యేక స్థానమని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని తుంగపాడు గ్రామంలో ఎన్‌టీఆర్ వర్ధంతి కార్యక్ర మంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●మండలంలోని వడ్లమూడివారిపాలెం, వీరవట్నం గ్రామాల్లో జరిగిన వర్ధంతి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చదలవాడ పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

చిలకలూరిపేటలో..



చిలకలూరిపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని పలుచోట్ల ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఎన్ఆర్‌టి సెంటర్, నెహ్రూనగర్, కళామందిర్ సెంటర్, సుగాలి కాలనీ, ఎన్టీఆర్ కాలనీలలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించి, అన్నదాన కార్యక్రమాలతో పాటు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. 32వ వార్డు భావ నారుషినగర్‌లో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ దేశ వ్యాప్తంగా అమల్లో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మానం వెంకటేశ్వర్లు, షేక్ కరీముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మురకొండ మల్లిబాబు, శివ, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యడ్లపాడు(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను టీడీపీ శ్రేణులు నిర్వహించాయి. యడ్లపాడు స్టేజి సెంటర్, మైదవోలు రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లింగారావుపాలెంలోని పాలకేంద్రం, బీసీ కాలనీ, తిమ్మాపురం, కారుచోల, తదితర గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు స్థానిక టీడీపీ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

ఈపూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రముట్ల, బోడెపూడివారిపాలెం, కొచ్చెర్ల, ఉప్పరపాలెం, అంగలూరు, ముప్పాళ్ళ, గోపువారిపాలెం, ఇనుమెళ్ళ ఈపూరు, గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మండల అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, అయినాల కోటేశ్వరరావు, నర్రా కిశోర్, డీసీ చైర్మన్ గడిపూడి వేణుగోపాల్, సాగునీటి సంఘం అధ్యక్షుడు శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లటూరు, బొల్లాపల్లి, పేరూరుపాడు, సంగినీడుపాలెం, వడ్డెంగుంట తదితర గ్రామాల్లో ఎన్‌టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, గోవిందు నాయక్, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, హనుమానాయక్, అర్లపూడి శ్రీనివాసరావు, కందుల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూజెండ్ల (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త జెడ్డావారి పాలెం క్రీడా మైదానంలో రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ పారా వెంకట లక్ష్మయ్య ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. కొత్తచెరుకుంపాలెంలో జడ్పీటీసీ జెడ్డా సుబ్బులు రామయ్య, నూజెండ్లలో టీడీపీ నాయకు లు గంగినేని ఆంజనేయులు, నూజెండ్ల సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, బచ్చు అంజిరెడ్డి, లగడపాటి నూరి బాబు, వీ అప్పాపురంలో ములకలూరు డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి తదితరులు గ్రామాల్లో ఎన్‌టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివా ళులర్పించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



యడ్లపాడు స్టేజి సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న గ్రామ టీడీపీ నాయకులు

శావల్యాపురం (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయ రంగాల్లో తనదైన ముద్రవేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానుభావుడు నందమూరి తారక రామారావు అని శావల్యాపురం జడ్పీటీసీ పారా హైమావతి అన్నారు. శావల్యాపురం, కనమర్లపూడి గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి శనివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సామాజిక భద్రత పింఛన్‌లను తనిఖీ చేసిన వైద్య బృందం



గణపవరంలో పింఛన్‌దారులను పరిశీలిస్తున్న వైద్య బృందం

నాదెండ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో గల సామాజిక భద్రత పింఛన్ లబ్దిదారులను శనివారం వైద్య బృందం తనిఖీ చేసింది. మండలంలోని మొత్తం 41 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరు మంచానికే పరిమితమయ్యారా?, ఆరోగ్య పరిస్థితులు తదితర విషయాలపై ఇంటింటికి వెళ్లి తనిఖీ చేశారు. గుంటూరు, విజయవాడల నుంచి వచ్చిన వైద్యు లు అయ్యప్ప నాయుడు, లక్ష్మీకాంత్, ప్రసాదు నాయక్‌లు ఎంపీడీవో స్వరూపరాణి ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

● **శావల్యాపురం, జనవరి 18 (ఆంధ్రప్రదేశ్):** మండలంలోని వేల్పూరు, పోట్లూరు, శావల్యాపురం, కనమర్లపూడి, మతుకుమల్లి, వయ్యకల్లు, కారుమంచి గ్రామాల్లోని డీఎంహెచ్‌వో పింఛనుదారులను జిల్లా వైద్య బృందం శనివారం తనిఖీలు నిర్వహించారు. బృందం సభ్యులు వరుణ్, రోశయ్య పాల్గొని మండలంలో డీఎంహెచ్‌వో పింఛన్లు పొందుతున్న 16మంది లబ్ధిదారులను వారి ఇళ్లకెళ్లి సందర్శించారు. వారి వద్దనున్న సదరం సర్టిఫికెట్‌లు, ఆధారాలను తనిఖీ చేశారు. ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మాన్యం రాధాకృష్ణన్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అభినందన గ్రూపు డైరెక్టర్ మృతి

● కొమ్మాలపాటి, పలువురి నివాళి

నాదెండ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎండుగుంపాలెం గ్రామస్థుడు, అభినందన గ్రూపు డైరెక్టర్ నందిగం సాంబశివరావు(68) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. గుంటూరులో నివాసం ఉంటున్న ఆయనకు గుండెపోటు రావటంతో అకాల మరణం చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. అంత్యక్రియలు సోమవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

స్వచ్ఛత, శుభ్రత జీవితాల్లో భాగం కావాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం ప్రతినెలా మూడో శనివారం నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, స్వచ్ఛత.. శుభ్రత అనేవి అందరి జీవితాల్లో భాగం కావాలన్నదే కార్యక్రమం ఉద్దేశమని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం అన్నారు. స్థానిక ఎన్ఆర్‌టీ సెంటర్లో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛాంధ్ర కార్య క్రమంలో భాగంగా ఆయన రోడ్లను శుభ్రం చేశారు. కూటమి పార్టీల శ్రేణులతో కలిసి ప్రత్తిపాటి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. కూటమి పార్టీల శ్రేణులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయంలో..

స్థానిక తహసీల్దారు కార్యాలయంలో కూడా స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని తహసీల్దారు షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యాలయాన్ని, కార్యాలయ ఆవరణను శుభ్రం చేసి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ఏ వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, సహాయకులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవిందబాబు, కమిషనర్ జస్వంత్‌రావు, తదితరులు

నరసరావుపేట కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక 6వ వార్డు బాబాపేటలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్‌లో కార్యక్రమంలో పాల్గొన్నారు. బాబాపేట నుంచి కూరగాయల మార్కెట్ వరకు రోడ్లను శుభ్రపరిచారు. చెత్త, పిచ్చి మొక్కలు తొలగించారు. అనంతరం ప్రజలతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జస్వంత్‌రావు మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచాలి : జేసీ సూరజ్

జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉద్యోగులతో కలిసి పరిసరాల శుభ్రత చేపట్టారు. పచ్చదనం కోసం ప్రాంగణంలో చెట్లు నాటారు. అనంతరం ఆయన ఉద్యోగులతో మాట్లాడుతు ప్రతి ఉద్యోగి వ్యక్తిగత శుభ్రతతో పాటు కలెక్టరేట్‌ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతినెల మూడో శనివారం విధిగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మురళి, జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అధికారి భానుకీర్తి వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

● **రొంపిచర్ల (ఆంధ్రజోతి):** మండలంలోని రొంపిచర్లలో స్వచ్ఛంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. డ్వామా పీడీ సిద్ధలింగ మూర్తి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాధ్యూబాబు, ఏపీవో ప్రసాదు, అంగన్‌వాడీ, ఉపాధి హామీ, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రప్రదేశ్‌ను సాధించేందుకు సహకరించాలి

● టీడీపీ మండలాధ్యక్షుడు సాంబశివరావు

శావల్యాపురం, జనవరి 18 (ఆంధ్రప్రదేశ్): గ్రామాల్లోని ప్రజలంతా పరిసరాల శుభ్రతను పాటిస్తూ రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి శనివారం శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు.

కాలుష్య భూతాన్ని అరికట్టాలి : కమిషనర్ సుబాష్‌చంద్రబోస్

వినుకొండటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా కాలుష్యం భూతాన్ని పారద్రోలాలని మున్సిపల్ కమిషనర్ సుబాష్ చంద్రబోస్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో బాగంగా శనివారం జూనియర్ కళాశాల ఆవరణలో విద్యావంతులు, కళాకారులు స్థానిక ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బాగంగా జూనియర్ కళాశాల మైదానంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చిచెట్లను తొలగించారు.

● స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పుట్టారెడ్డి అధ్యక్షతన స్వచ్ఛాంధ్ర స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

నూజెండ్ల (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లిలో శనివారం స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థులతో స్వచ్ఛంధ్ర ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ షేక్ రబ్బానీ, స్వచ్ఛ భారత్ కో--ఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, పంచాయతీ కార్యదర్శి సందీప్ సాండిల్య, చిట్టిబాబు, జానీ బాషా, అసన్ పీర, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లిలో స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం బొల్లాపల్లి పంచాయతీ పరిధిలో శుభ్రత పరిశుభ్రత గురించి మండల స్థాయి అధికారులచే గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

రహదారి భద్రతా నియమాలను పాటించాలి

● అడిషనల్ ఎస్పీ జేవీ సంతోష్



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ జీవీ సంతోష్

నరసరావుపేట రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలందరూ జాతీయ రహదారి భద్రతా నియమాలను పాటించాలని అడిషనల్ ఎస్పీ జేవీ సంతోష్ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు - 2025 సందర్భంగా పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో జెండా ఊపి రోడ్డు భద్రతా అవగాహన ప్రచార రథాన్ని ఏఎస్పీ సంతోష్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమం జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జాతీయ రహదారి భద్ర తా మాసోత్సవాలు-2025.. దుర్గ పద్మజ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

రహదారి భద్రతపై అవగాహన సదస్సు

చిలకలూరిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రతా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద శనివారం వాహనదారులతో అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కేఎల్‌రావు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదని, అతివేగం ప్రమాదకరమని వివరించారు.